# తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం   జాతీయ పత్రిక

| యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 24 | గురువారం | 20-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/- |
|---|---|---|---|---|---|---|
| Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:24 | Thursday | 20-8-2026 | Pages:08 | Cost:2/- |









## రష్యాలో డ్రోన్ దాడి.. భారత వైద్య విద్యార్థికి గాయాలు

- రష్యాలోని ఉఫాలో డ్రోన్ దాడిలో భారత విద్యార్థికి గాయాలు
- బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో చదువుతున్న బాధితుడు
- విద్యార్థి ఆరోగ్యం నిలకడగా ఉందని ప్రకటించిన భారత ఎంబసీ

# గ్రూప్-1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

- అసెంబ్లీలో సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు
- గత ప్రభుత్వంలో గ్రూప్-1 పరీక్షల్లో భారీ అక్రమాలు జరిగాయన్న సీఎం
- ఎలక్ట్రీషియన్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో జవాబు పత్రాలు దిద్దించారని ఆరోపణ
- కోర్టు ఆదేశాలను ధిక్కరించి ప్రైవేటు వ్యక్తులకు మూల్యాంకనం అప్పగించారని ఆగ్రహం
- సీఐడీ కస్టడీలో ఉన్న హాయ్‌లాండ్‌లో వాల్యుయేషన్ జరిపి అక్రమాలకు పాల్పడ్డారన్న సీఎం
- భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ

గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 నియామకాల్లో కనీవినీ ఎరుగని రీతిలో భారీ కుంభకోణం జరిగిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దే ఉన్నతాధికారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా నిర్వహించిన పరీక్షల జవాబు పత్రాలను ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ గార్డులతో దిద్దించారని, ఇంతకంటే బరితెగింపు మరొకటి ఉండదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో నిబంధన 344 కింద బుధవారం జరిగిన చర్చలో చంద్రబాబు ఈ అక్రమాలపై సవివరంగా ప్రసంగించారు. 2018లో జారీ చేసిన గ్రూప్-1 నోటిఫికేషన్‌కు సంబంధించి జరిగిన మూల్యాంకన ప్రక్రియ మొత్తం అక్రమాలకు నిలయంగా మారిందని చంద్రబాబు పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలను సైతం ధిక్కరించి, తప్పుడు అఫిడవిట్లు దాఖలు చేసి మరీ ప్రైవేటు వ్యక్తులకు

- మిగతా 2వ పేజీలో





## అసలేంటి సెక్షన్ 22ఏ పొరపాటు ఎలా జరిగింది?

- తెలంగాణలో వేలాది ప్రైవేట్ ఆస్తులు 22ఏ నిషేధిత జాబితాలో చేరిక
- రిజిస్ట్రేషన్లు, అమ్మకాలు నిలిచిపోవడంతో యజమానుల ఆందోళన
- అధికారుల తప్పిదమే కారణమని అంగీకరించిన ప్రభుత్వం
- సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష, దిద్దుబాటు చర్యలకు ఆదేశం
- మంత్రి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాల డిమాండ్




## ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం

- అసెంబ్లీలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన లోకేశ్
- ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుపై నిబంధనలను సరళతరం చేస్తూ అసెంబ్లీలో బిల్లు
- భూమి నిబంధన 50 నుంచి 10 ఎకరాలకు తగ్గింపు
- కనీస పెట్టుబడి నిబంధన తొలగింపు, ఎండోమెంట్ ఫీజు రూ. 5 కోట్లకు కుదింపు
- రాష్ట్రంలో 'విష్ణు మహిళా విశ్వవిద్యాలయం' ఏర్పాటుకు ఆమోదం
- 60 రోజుల్లోనే ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో ఆన్‌లైన్‌లో వర్సిటీలకు అనుమతులు

# రెండు చరణాలకే కట్టుబడతాం

- వందేమాతరం పూర్తిగా ఆలపించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించిన సీడబ్ల్యూసీ
- రామాలయంలో చందాచోరీ అంశంలో ప్రభుత్వానిదే జవాబుదారీ
- చైనా ఆక్రమణలపై సమాధానం చెప్పాలి
- విద్యార్థుల డిమాండ్లను ప్రభుత్వం తీర్చాల్సిందే
- పోటీ పరీక్షల విధానంలో సంస్కరణలపై కాంగ్రెస్‌పాలిత రాష్ట్రాల నుంచి నివేదికలు
- మరిన్ని నగరాల్లో రాహుల్ 'ఛాత్రోంకీ గూంజ్'కార్యక్రమం
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయాలు




న్యూఢిల్లీ: జాతీయగేయం వందేమాతరంను పూర్తిగా ఆలపించాలన్న మోదీ సర్కార్ కొత్త నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ అత్యున్నత నిర్ణాయక కమిటీ అయిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) తప్పుబట్టింది. మహాత్ముడు, నెహ్రూ, నేతాజీ, సర్దార్ పటేల్ తదితర దిగ్గజ నేతలు 1937లో చేసిన తీర్మానం మేరకే వందేమాతరం గేయంలో తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపిస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. ఈ మేరకు సీడబ్ల్యూసీ నిర్ణయం తీసుకుంది. ఢిల్లీలో పార్టీ ప్రధాన కార్యాలయం 'ఇందిరాభవన్'లో బుధవారం మధ్యాహ్నం పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన ఏకంగా నాలుగు గంటలకుపైగా సీడబ్ల్యూసీ భేటీ జరిగింది. సీడబ్ల్యూసీ భేటీలో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతోపాటు అజయ్ మాకెన్, కేసీ వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ, అంబికాసోనీ, ముకుల్ వాస్నిక్, జైరాం రమేశ్‌లతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్ రెడ్డి(తెలంగాణ), వీడీ సతీశన్(కేరళ), సుక్వీందర్ సింగ్ సుఖూ(హిమాచల్ ప్రదేశ్), డీకే శివకుమార్(కర్ణాటక) పాల్గొన్నారు. తర్వాత సీడబ్ల్యూసీ నిర్ణయాలను కేసీ వేణుగోపాల్, జైరాంరమేశ్ మీడియాకు వెల్లడించారు. భేటీలో మొత్తం 88 మంది పాల్గొన్నారని 33 మంది మాట్లాడారని తెలిపారు. "వందేమాతరంలో తొలి రెండు చరణాలను మాత్రమే ఆలపించాలని 1937 అక్టోబర్ 28న రవీంద్రనాథ్ ఠాకూర్

- మిగతా 2వ పేజీలో




## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచారు: ఎస్పీ వెల్లడి

- జల్సాలు, డబ్బు కోసమే ఈ దారుణానికి పాల్పడినట్టు పోలీసుల వెల్లడి
- గతంలో మందలించడంతో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్న నిందితుడు
- 70 సీసీ కెమెరాలు పరిశీలించి ఇద్దరు మైనర్లను అరెస్ట్ చేసిన పోలీసులు
- నిందితుల నుంచి రూ. 1.54 లక్షల నగదు, ఐఫోన్ స్వాధీనం

## కొత్త పార్టీ పెడుతున్నా..

- తిరుమలలో విజయసాయి రెడ్డి కీలక ప్రకటన
- వైసీపీలోకి రీఎంట్రీపై ఊహాగానాలకు తెరదించిన విజయసాయి రెడ్డి
- సొంతంగా కొత్త రాజకీయ పార్టీ పెడుతున్నట్లు అధికారిక ప్రకటన
- తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రాజకీయ భవిష్యత్‌పై వ్యాఖ్యలు
- ఈ నెలలోనే విజయవాడలో పార్టీ ప్రణాళికను వెల్లడిస్తానని స్పష్టీకరణ






## ఎన్నికలకు సిద్ధంకండి..

- గెలుపే లక్ష్యంగా పని చేయండి: జగన్
- రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నేతలతో జగన్ భేటీ
- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్న జగన్
- రాబోయే ఎన్నికల్లో వైసీపీదే విజయమని ధీమా

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సత్తా చాటాలి




- అవసరమైన ప్రచారం.. ఇతర సహకారానికి ముందుంటాం
- కీలకమైన రాష్ట్రాల్లో తెలంగాణ నేతలు అక్కడే మకాం వేసేందుకు సిద్ధం
- యువతకు మరింత చేరువయ్యేలా రాష్ట్రంలో ప్రత్యేక కార్యక్రమాలు
- సీడబ్ల్యూసీ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి

న్యూఢిల్లీ: ఐదు రాష్ట్రాల్లో త్వరలో జరగబోయే శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పూర్తి సత్తా చాటాలని, అందుకు అవసరమైన అన్నిరకాల సహకారం అందించేందుకు తెలంగాణ

- మిగతా 2వ పేజీలో

# రష్యాలో డ్రోన్ దాడి.. భారత వైద్య విద్యార్థికి గాయాలు

రష్యా–ఉక్రెయిన్ యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో, రష్యాలోని ఉఫా నగరంలో జరిగిన డ్రోన్ దాడిలో ఒక భారతీయ విద్యార్థి గాయపడ్డారు. ప్రస్తుతం బాధితుడు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని మాస్కోలోని భారత రాయబార కార్యాలయం బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఉఫాలోని బష్కిర్ స్టేట్ మెడికల్ యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న ఈ విద్యార్థిపై డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. ఈ ఘటనపై భారత రాయబార కార్యాలయం (ఎంబసీ) తక్షణమే స్పందించింది. గాయపడిన విద్యార్థితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. భద్రతా కారణాల దృష్ట్యా సదరు విద్యార్థికి సంబంధించిన వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచారు. గత మూడు రోజులుగా రష్యా భూభాగంపై ఉక్రెయిన్ డ్రోన్ దాడులను తీవ్రతరం చేసింది. ఈ క్రమంలో, మాస్కోకు సుమారు 1,200 కిలోమీటర్ల దూరంలో ఉన్న కీలక పారిశ్రామిక నగరం ఉఫా లక్ష్యంగా దాడులు కొనసాగుతున్నాయి. ఇక్కడి చమురు శుద్ధి కర్మాగారంపై సైతం దాడులు జరిగినట్లు వార్తలు వెలువడుతున్నాయి.

# కొత్త పార్టీ పెడుతున్నా..

మాజీ ఎంపీ వి. విజయసాయి రెడ్డి తన రాజకీయ పునః ప్రవేశంపై నెలకొన్న సందిగ్ధతకు తెరదించారు. వైసీపీలోకి తిరిగి వెళ్తారంటూ జోరుగా సాగుతున్న ప్రచారానికి ఫుల్‌స్టాప్ పెడుతూ, సొంతంగా కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. ఈరోజు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తన కొత్త పార్టీకి శ్రీవారి ఆశీస్సులు కోరినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టాలనే లక్ష్యంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విజయసాయి రెడ్డి వివరించారు. ప్రజల పక్షాన బలమైన గొంతుకను వినిపించేందుకే కొత్త పార్టీ పెడుతున్నానని స్పష్టం చేశారు. పార్టీకి సంబంధించిన పూర్తి వివరాలు, భవిష్యత్ కార్యాచరణను ఈ నెలలోనే విజయవాడలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వెల్లడిస్తానని తెలిపారు. దేశం ఎల్‌నినో ప్రభావం లేకుండా సుభిక్షంగా ఉండాలని కూడా స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన పేర్కొన్నారు. గతేడాది తన రాజ్యసభ సభ్యత్వానికి, వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసిన విజయసాయి రెడ్డి, ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటూ వ్యవసాయం చేసుకుంటానని ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, కొన్ని నెలలకే ఆయన తన నిర్ణయాన్ని మార్చుకున్నారు. రాజకీయాల్లోకి తిరిగి వస్తానని, సొంతంగా ఒక మీడియా సంస్థను కూడా ప్రారంభిస్తానని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. అప్పటి నుంచి సోషల్ మీడియాలో చురుగ్గా ఉంటూ పలు జాతీయ, రాష్ట్ర అంశాలపై తన అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల కాలంలో ఆయన తిరిగి వైసీపీ గూటికి చేరతారనే ప్రచారం ఊపందుకుంది. ఈ నేపథ్యంలోనే ఆయన స్పందిస్తూ.. తనది స్వతంత్ర భావజాలమని, ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా రాష్ట్ర ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా నిర్ణయం తీసుకుంటానని ట్విట్టర్ వేదికగా స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే 'భారత్ జన వికాస్' పేరుతో ఆయన పార్టీ పెట్టబోతున్నారంటూ సోషల్ మీడియాలో చర్చ జరిగింది. తాజాగా తిరుమలలో ఆయన చేసిన ప్రకటనతో ఈ ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే సొంత జెండాతో ఏపీ రాజకీయాల్లోకి అడుగుపెట్టడం ఖాయమైంది.

# ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సత్తా చాటాలి

కాంగ్రెస్ సిద్ధంగా ఉందని సీఎం రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. బుధవారం ఢిల్లీలోని ఇందిరాభవన్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే అధ్యక్షతన నిర్వహించిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. అధిష్టానం ముఖ్యమంత్రులకు మాట్లాడే అవకాశం ఇవ్వగా, సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ వ్యూహాలు, జాతీయ స్థాయిలో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఉత్తరప్రదేశ్, పంజాబ్ వంటి కీలకమైన రాష్ట్రాల్లో ప్రచారం నిర్వహించేందుకు తెలంగాణకు చెందిన ముఖ్య నాయకులు, పీసీసీ ప్రతినిధులు సిద్ధంగా ఉన్నారన్నారు. అధిష్టానం ఆదేశిస్తే.. పార్టీ విజయంలో కీలక భూమిక పోషించే ప్రచారం కోసం అక్కడే మకాం వేసి పూర్తిస్థాయిలో పనిచేస్తారని సీఎం తెలిపారు. తెలంగాణలో తమ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, 6 గ్యారంటీలను ఆయా రాష్ట్రాల ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రచారాన్ని రూపొందిస్తామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను క్షేత్రస్థాయిలో గట్టిగా తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పేపర్ లీకేజీ, అయోధ్య రామాలయంలో చందాల చోరీ వంటి విషయాల్లో బీజేపీ తీరును క్షేత్రస్థాయిలో ఎండగట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదే సమయం యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు తెలంగాణ వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు, సమరశీల పోరాటాలు చేపడుతున్నామని వివరించారు. భవిష్యత్ ఎన్నికల్లో యువతే కీలకపాత్ర పోషించనున్నందున, వారి సమస్యలపై నిరంతరం దృష్టి సారిస్తున్నామని చెప్పారు.

## సుస్మితా కీలక వ్యాఖ్యలు.. రేవూరిని గెలిపించగలరా?

వరంగల్ జిల్లా గీసుకొండ మండల కేంద్రంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మితా సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడు కావాలని ఆనాడు మొదట కోరింది కొండా దంపతులేనని గుర్తుచేసిన ఆమె, కొండా మురళిని ఎమ్మెల్సీ చేస్తానని రేవంత్ రెడ్డి మాట ఇచ్చింది నిజం కాదా అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు పరకాల ప్రజలకు రేవూరి ప్రకాష్ రెడ్డి ఎవరికీ తెలియదని, కొండా మురళి స్వయంగా రంగంలోకి దిగి ప్రచారం చేయడం వల్లే ఆయన విజయం సాధించారని స్పష్టం చేశారు. తమకు కాంగ్రెస్ అధిష్టానం అంటే అత్యంత గౌరవం ఉందని, అయితే తమ కుటుంబం ఎవరికీ ఊడిగం చేసే ప్రసక్తి లేదని కుండబద్దలు కొట్టారు. రాబోయే రోజుల్లో పరకాల నియోజకవర్గం నుంచి తాను పోటీ చేసి తీరుతానని, పరకాల గడ్డ తనదేనని కొండా సుస్మితా అత్యంత ధీమాతో ప్రకటించారు.

# గ్రూప్–1 పేపర్లు దిద్దింది ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు

(మొదటి పేజీ తరువాయి)

మూల్యాంకన బాధ్యతలు అప్పగించారని విమర్శించారు. అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఏపీపీఎస్సీ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి, తన స్నేహితులకు, బంధువులకు ఈ ప్రక్రియను కట్టబెట్టారని ఆరోపించారు. పరీక్ష జవాబు పత్రాలను పీడీఎఫ్ రూపంలో ప్రైవేటు జీ–మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌ల ద్వారా పంపి వ్యవస్థను పూర్తిగా భ్రష్టు పట్టించారని మండిపడ్డారు. సీఐడీ స్వాధీనంలో ఉన్న హాయ్‌ల్యాండ్‌లో 84 రోజుల పాటు అనధికారికంగా జవాబు పత్రాలను ఉంచి మూల్యాంకనం చేశారని, దీని కోసం రూ. 1.19 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు, చేర్పులు జరిగాయని, వైట్‌నర్ కూడా వినియోగించారని ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని వివరించారు. మూల్యాంకన కేంద్రంలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు లేకుండా చేసి, మొబైల్ ఫోన్లను అనుమతించి అక్రమాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారం రాష్ట్ర యువత భవిష్యత్తుతో ఆడుకోవడమేనని చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఇది గత పాలనలో జరిగిన అతిపెద్ద కుంభకోణాలలో ఒకటని, దీనిపై పూర్తిస్థాయిలో విశ్లేషణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా, ఏపీపీఎస్సీలో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, తప్పు చేసిన వారు ఎంతటివారైనా కఠిన శిక్ష తప్పదని శాసనసభ వేదికగా హెచ్చరించారు.



వేల సంఖ్యలో నకిలీ ఓఎంఆర్ షీట్లు ముద్రించడం నుంచి జవాబు పత్రాలను మార్చేయడం వరకు అనేక అక్రమాలు గత ప్రభుత్వ హయాంలో జరిగాయని చంద్రబాబు వివరించారు. కొత్త ఛైర్మన్‌గా గౌతమ్ సవాంగ్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత మాన్యువల్ ఎవాల్యుయేషన్‌కు ఆదేశించడంతోనే ఈ అక్రమాలు వెలుగులోకి వచ్చాయని ముఖ్యమంత్రి తెలిపారు. సుమారు 49 వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులను ఒక ప్రైవేట్ సంస్థలో ముద్రించారని, ఎగ్జామినర్ల జాబితాను వాట్సాప్, టెలిగ్రామ్ గ్రూపుల్లో సర్క్యులేట్ చేశారని ఆరోపించారు. జవాబు పత్రాల్లో వేర్వేరు చేతిరాతలు, ఓవర్ రైటింగ్‌లను గుర్తించామన్నారు. పరిశీలించిన 734 ఓఎంఆర్ స్లిప్పుల్లో 718 స్లిప్పుల్లో మార్పులు జరిగినట్లు తేలిందని, 21 స్లిప్పులపై ఎలాంటి సంతకాలు లేవని పేర్కొన్నారు. జవాబు పత్రాలు దిద్దే గదిలో 17 రోజుల పాటు సీసీ కెమెరాలు నిలిపివేయడమే కాకుండా, మొబైల్ ఫోన్లను కూడా అనుమతించారని తెలిపారు. గ్రూప్–1 పరీక్ష రాసిన అభ్యర్థినే మూల్యాంకనానికి ఎగ్జామినర్‌గా నియమించడం ఈ అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు. గత పాలనలో బరితెగించి చేసిన అతిపెద్ద కుంభకోణం ఇది అని చంద్రబాబు అభివర్ణించారు. "తప్పు జరగలేదని చెప్పే ధైర్యం వారికి ఉందా?" అని ప్రశ్నించారు. జరిగిన దుర్మార్గాన్ని విశ్లేషించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవస్థలు కేవలం వ్యక్తుల కోసం కాదని, యువత భవిష్యత్తు కోసమేనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా ప్రజలు, మేధావుల నుంచి అభిప్రాయాలు స్వీకరించి పటిష్ఠమైన వ్యవస్థను రూపొందిస్తామని సీఎం హామీ ఇచ్చారు.

# ఎన్నికలకు సిద్ధంకండి..

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా వైసీపీ శ్రేణులు ఐక్యంగా పని చేయాలని ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్ పిలుపునిచ్చారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో రాజమండ్రి రూరల్ నియోజకవర్గ నాయకులు, స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో ఆయన కీలక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో పాటు పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారాయని విమర్శించారు. ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న తీవ్ర వ్యతిరేకతను కప్పిపుచ్చేందుకు, దృష్టి మళ్లించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎన్నికలలో ప్రజల ఆమోదాన్ని అడ్డుకోవడానికి అధికార యంత్రాంగాన్ని, పోలీసులను ప్రయోగించే అవకాశం ఉందని, అన్నింటినీ ఎదుర్కొని పోరాటానికి సిద్ధం కావాలని నాయకులకు సూచించారు. వైసీపీకి ఉన్న ప్రజాదరణతో రాబోయే ఎన్నికల్లో విజయం మనదేనని ధీమా వ్యక్తం చేశారు. మరో ఏడాదిలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని చెప్పారు.

## అసలేంటి సెక్షన్ 22ఏ? పొరపాటు ఎలా జరిగింది?

తెలంగాణ వ్యాప్తంగా, ముఖ్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లో వేలాది మంది ప్రైవేట్ ఆస్తుల యజమానులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారి ఇళ్లు, స్థలాలు, అపార్ట్‌మెంట్లు ఉన్నట్టుండి రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో చేరడంతో అమ్మకాలు, తనఖాలు, బదిలీలు నిలిచిపోయాయి. రెవెన్యూ రికార్డుల నవీకరణలో జరిగిన పరిపాలనా లోపాలే ఈ సంక్షోభానికి కారణమని తేలడంతో ప్రభుత్వం క్షమాపణలు చెప్పి, తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టింది. మరోవైపు, ఈ అంశంపై ప్రతిపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. రిజిస్ట్రేషన్ చట్టం, 1908లోని సెక్షన్ 22ఏ ప్రకారం ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ ఆస్తులు, అసైన్డ్ భూములు, భూదాన భూములు, కోర్టు వివాదాల్లో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను నిలిపివేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ప్రభుత్వ ఆస్తులను అక్రమ బదిలీల నుంచి కాపాడటమే దీని ముఖ్య ఉద్దేశం. అయితే, ధరణి పోర్టల్ స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన 'భూ భారతి' విధానంలోకి మారే క్రమంలో, 2026 ఏప్రిల్‌లో రెవెన్యూ శాఖ నిషేధిత ఆస్తుల జాబితాను నవీకరించింది. ఈ ప్రక్రియలో అధికారులు సరైన పరిశీలన లేకుండానే జాబితాలను సబ్–రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపారు. ఒకే సర్వే నంబర్‌లో కొంత భాగం ప్రభుత్వ భూమి ఉంటే, ఆ సర్వే నంబర్‌లోని మొత్తం ప్రైవేట్ పట్టా భూములను కూడా నిషేధిత జాబితాలో చేర్చడంతో ఈ గందరగోళం తలెత్తింది.

# ప్రైవేటు వర్సిటీల ఏర్పాటు సులభతరం....

ఆంధ్రప్రదేశ్‌లో ప్రైవేటు విశ్వవిద్యాలయాల ఏర్పాటు ప్రక్రియను సరళతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఈ మేరకు 'ఏపీ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు 2026'ను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టారు. నిబంధనలను సరళతరం చేసి, ఉన్నత విద్యా రంగంలో పెట్టుబడులను ఆకర్షించడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తిగా తీసుకొచ్చిన 'జన్ విశ్వాస్' విధానంలో భాగంగానే ఈ సవరణలు చేస్తున్నట్లు మంత్రి లోకేశ్ వివరించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అన్ని రంగాలకు విస్తరింపజేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, ఉన్నత విద్యా రంగంలో నియంత్రణలను సులభతరం చేస్తున్నామన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో వర్సిటీల సంఖ్య తక్కువగా ఉందని, ఈ సవరణల ద్వారా కొత్త సంస్థలను ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఈ బిల్లులో పలు కీలక సవరణలు ప్రతిపాదించారు. ప్రధానంగా, ప్రైవేటు వర్సిటీ ఏర్పాటుకు అవసరమైన భూమిని 50 ఎకరాల నుంచి సీఆర్డీఏ, విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాల్లో 10 ఎకరాలకు, ఇతర ప్రాంతాల్లో 15 ఎకరాలకు తగ్గించారు. కనీస పెట్టుబడి నిబంధనను పూర్తిగా తొలగించి, కేసును బట్టి నిపుణుల కమిటీ నిర్ణయం తీసుకునేలా మార్పు చేశారు. ఎండోమెంట్ ఫీజును రూ.5 కోట్లకు పరిమితం చేశారు. బ్రౌన్‌ఫీల్డ్ వర్సిటీగా మారాలంటే యూజీసీ నిబంధనల ప్రకారం కనీసం 3.01 సీజీపీఏ తప్పనిసరి చేశారు.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచారు: ఎస్పీ వెల్లడి

నల్గొండ జిల్లాలో సంచలనం సృష్టించిన స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. విలాసాలకు అలవాటు పడిన ఇద్దరు మైనర్ విద్యార్థులే ఈ ఘాతుకానికి ఒడిగట్టినట్లు నిర్ధారించారు. నిందితుల్లో ఒకరు ఆమెను ఏకంగా 27 సార్లు కత్తితో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేసినట్లు నల్గొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ ఈ కేసు వివరాలను వెల్లడించారు. ఈ నెల 11న కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపల్ రూపారెడ్డి ఇంట్లో చోరీ చేసేందుకు ఇద్దరు విద్యార్థులు పథకం రచించారు. అందులో ఒకరు మాస్క్ ధరించి గోడ దూకి ఇంట్లోకి ప్రవేశించాడు. అయితే, ప్రమాదవశాత్తు మాస్క్ జారిపోవడంతో రూపారెడ్డి అతడిని గుర్తుపట్టారు. దీంతో భయాందోళనకు గురైన నిందితుడు, తన వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేశాడు. 27 సార్లు పొడిచి చంపిన అనంతరం, ఆమె ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు.

# రెండు చరణాలకే కట్టుబడతాం


(మొదటి పేజీ తరువాయి)

సూచనమేరకు నాటి దిగ్గజ నేతలు మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, మౌలానా ఆజాద్ నిర్ణయించారు. మేం సైతం వాళ్ల నిర్ణయాలకే కట్టుబడి ఉంటాం. కాంగ్రెస్‌కు సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో తొలి రెండు చరణాలే ఆలపిస్తాం. వందేమాతరం, జనగణమన అంటే మాకు ఒక భావోద్వేగ అంశం. బీజేపీకి మాత్రం ప్రతిదీ రాజకీయమే"అని అన్నారు. హల్ద్వనీలో ఖర్గే సభ ముగిసిన తర్వాత ఆ ప్రాంగణాన్ని బీజేపీ అనుబంధ సంఘాలు శుద్ధి చేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని వేణుగోపాల్ మండిపడ్డారు. రాజ్యసభ ప్రతిపక్ష నేతగా, జాతీయ పార్టీ అధ్యక్షుడిగా ఉన్న నాయకుడి విషయంలో ఇలా వ్యవహరించడం దారుణమన్నారు. నీట్ వంటి కీలక ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతంలో మోదీ ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని సీడబ్ల్యూసీ భేటీలో తీర్మానించారు. 2014 ఏడాది నుంచి 154 పేపర్ లీకేజీ ఉదంతాలు వెలుగుచూశాయి. నీట్ పేపర్‌లీకేజీ ఘటనలో 29 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ఐదేళ్లలో ఇలాంటి ఉదంతాల్లో 90 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు. గత 12 ఏళ్లలో ఉపాధి అవకాశాలు అడుగంటాయి. విద్యావ్యవస్థ వ్యాపారవ్యవస్థగా తయారైంది. జంతర్‌మంతర్‌లో విద్యార్థుల చలో సంసద్ ర్యాలీ సహా పలు రాష్ట్రాల్లో ఉద్యమించిన యువతపై ఎలక్ట్రిక్ షాక్ బ్యాటన్లు, బాష్పవాయుగోళాలు, పెల్లెట్ గన్‌లు, ఏకంగా ఏకే--47ను ప్రయోగించారు"అని సీడబ్ల్యూసీ తీర్మానంలో నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయోధ్య రామాలయంలో కోట్ల రూపాయల విరాళాలు చోరీకి గురైన అంశంలోనూ ప్రభుత్వానిదే జవాబుదారీ అని నేతలు తెగేసిచెప్పారు. కీలక అంశాలపై ప్రభుత్వం తరఫున సమాధానం చెప్పాల్సిన వేళ ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు రాకుండా ముఖం చాటేశారని సీడబ్ల్యూసీ తప్పుబట్టింది. పార్లమెంట్ ఉభయ సభల్లో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంలో ప్రతిపక్షాలు సంపూర్ణ విజయం సాధించాయని సీడబ్ల్యూసీ అభిప్రాయపడింది. రాహుల్‌గాంధీ నేతృత్వంలో కొనసాగుతున్న ఛాత్రోంకీ గూంజ్(విద్యార్థుల గొంతుక) కార్యక్రమానికి యువతలో విశేషమైన స్పందన రావడంతో ఇకపై దేశవ్యాప్తంగా 800 పట్టణాలు, నగరాల్లో ఈ కార్యక్రమం కొనసాగిస్తామని, కొన్ని సభల్లో మాత్రం రాహుల్ ప్రసంగిస్తారుని జైరాం రమేశ్ తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని సరిహద్దు ప్రాంతాలు చైనా ఆక్రమణలోకి వెళ్లాయి. పశ్చిమాసియా సంక్షోభంతో దేశీయంగా నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. విదేశాంగ విధానంలో మోదీ సర్కార్ ఘోరంగా విఫలమైంది"అని జైరాం తెలిపారు. దేశభక్తి గురించి మాట్లాడే వారు ఇప్పుడు అమెరికాకు, చైనాకు లొంగిపోయారని కేసీ వేణుగోపాల్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో విద్య, పోటీ, ఉద్యోగ నియామక పరీక్షల్లో చేపట్టాల్సిన సమస్యలు, యువత లేవనెత్తిన సమస్యల పరిష్కారం కోసం తీసుకోవాల్సిన చర్యలపై విద్యావేత్తలతో చర్చించి నివేదికను సిద్ధంచేసి నెల రోజుల్లోపు ఖర్గేకు సమర్పించాలని నలుగురు ముఖ్యమంత్రులను సీడబ్ల్యూసీ ఆదేశించింది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను పెంచకుండా యథాతథంగా కొనసాగించాలని సీడబ్ల్యూసీ డిమాండ్ చేసింది. ఈ 543 స్థానాల్లోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేసింది. దీనిపై తమిళనాడు శాసనసభ ఆమోదించిన తీర్మానానికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది.



# గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ పెద్దపీట

- మౌలిక వసతుల కల్పనకు నిరంతర కృషి
- సోమారంలో సీసీ రోడ్డును ప్రారంభించిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**తొలివెలుగు, రాజాపేట :** గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. రాజాపేట మండలం సోమారం గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును బుధవారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తోందన్నారు. పల్లెల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర అభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టి మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, స్థానిక సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి వంద శాతం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గొలుసుల అనూష యాకూబ్, పీఏసీఎస్ చైర్మన్ నేమిల మహేందర్ గౌడ్, ఆలేరు ఏఎంసీ డైరెక్టర్ సిల్వేరు బాలరాజు గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్ జంగా లక్ష్మీ యాదగిరి, ఎంపీడీవో కూతల నాగవేణి, ఎంపీవో ఆవుల కిషన్, పుప్పాల పద్మ, వార్డు సభ్యులు శీలం స్వరూప, బొమ్మకంటి సిద్దిరాజు, గ్రామ శాఖ అధ్యక్షుడు బొమ్మకంటి జంపయ్య, నాయకులు జంగ యాదగిరి, నారెడ్డి కమలాకర్ రెడ్డి, చిన్నం సంపత్ కుమార్, పుప్పాల నర్సయ్య, గిరిరాజు స్వామి, పుప్పాల పెద్దిరాజు, బూడిద సురేష్, బండ నరేష్, జంగ ఎల్లయ్య, చిన్నం మహేష్, తావిటి బాలరాజు పాల్గొన్నారు.

# 'అమ్మ'కు బోనం.. ఆనందాల పర్వం

- చిన్నగూడూరులో వైభవంగా బోనాల సంబరాలు
- భక్తితో మొక్కులు చెల్లించుకున్న గ్రామస్తులు



**తొలివెలుగు, చిన్నగూడూరు :** చిన్నగూడూరు మండల కేంద్రంలో బుధవారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వేకువజామునే ఇళ్లను శుభ్రం చేసుకున్న మహిళలు.. అమ్మవారికి నైవేద్యంగా సమర్పించేందుకు పవిత్రంగా బోనాలు తయారు చేశారు. అనంతరం ఆలయాలకు చేరుకుని అమ్మవారికి బోనం, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తితో పూజిస్తే అమ్మవారు కోరిన కోరికలు తీరుస్తారని భక్తులు విశ్వాసం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా పలువురు భక్తులు కోళ్లు, యాటపోతులను బలి ఇచ్చి తమ మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ సంప్రదాయ ఉత్సవాల్లో ఒకటైన ఈ వేడుకల్లో మహిళలు, చిన్నారులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# ఫొటోగ్రఫీ పోటీల్లో సత్తా చాటిన రామన్నపేట వాసి

- కాట్రేగు సంజీవకు రెండు అవార్డులు
- ఖమ్మంలో ఘనంగా బహుమతి ప్రదానం

**తొలివెలుగు, రామన్నపేట :** 187వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో రామన్నపేటకు చెందిన ఫొటోగ్రాఫర్ కాట్రేగు సంజీవ సత్తా చాటారు. హుస్సేన్ ఖాన్ ఆర్ట్ ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఫొటోగ్రాఫర్లకు 'ఖమ్మం ఫొటోగ్రఫీ కాంటెస్ట్–2026'ను నిర్వహించారు. ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సంజీవ ఏకంగా రెండు అవార్డులను దక్కించుకున్నారు. ఖమ్మం ఎన్జీవో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు హుస్సేన్ ఖాన్ మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాల నుంచి 122 మంది ఫొటోగ్రాఫర్లు 1,072 ఫొటోలతో పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. బ్లాక్ అండ్ వైట్, కలర్, వెడ్డింగ్, ఫెస్టివల్, నేచర్, ప్రీ వెడ్డింగ్ తదితర ఆరు విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లు తీసిన దృశ్యాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయన్నారు. ఎప్పటికప్పుడు మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుని వృత్తిలో రాణించాలని ఆకాంక్షించారు. రెండు అవార్డులు సాధించిన సంజీవను తోటి ఫొటోగ్రాఫర్లు అభినందించారు.




# విద్యార్థినుల భద్రత, పరిశుభ్రతకు ప్రాధాన్యత

- గుండ్లపల్లి గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ
- సివిల్ పనులకు రూ.26 లక్షలు.. వెంటనే పనులు చేపట్టాలని ఆదేశం

**తొలివెలుగు, నల్గొండ :** రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన వాతావరణం, భద్రత కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నల్గొండ జిల్లా డిండి మండలం గుండ్లపల్లిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, డార్మెటరీ, వంటగది, స్టోర్ రూమ్, వాష్‌రూమ్‌లను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల ఆవరణలో చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా తరలించాలని కార్యదర్శి జంగయ్యను ఆదేశించారు. వాష్‌రూమ్‌లను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు దెబ్బతిన్న తలుపులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.



**రూ.26 లక్షలతో అభివృద్ధి పనులు:**

గురుకులంలో సివిల్ పనుల కోసం ప్రభుత్వం ఇటీవల రూ. 26 లక్షలు మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. ఈ నిధులతో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్, భవన మరమ్మతుల పనులను వెంటనే ప్రారంభించాలని డీఈ శైలజను ఆదేశించారు. విద్యార్థినులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక వసతులను మెరుగుపరచాలని సూచించారు.

**వంట సరుకులు వృథా చేయొద్దు:**

వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్.. స్టాక్ రిజిస్టర్‌ను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ప్రిన్సిపల్ శిరీష, స్టోర్ కీపర్లకు సూచించారు. గడువు దాటిన ఆహార పదార్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించవద్దని హెచ్చరించారు. తాజా కూరగాయలనే వంటకు ఉపయోగించాలని, వంట సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఆదేశించారు. వంట సమయంలో చేతులకు గ్లౌజులు, తలకు హెడ్ కవర్లు ధరించాలని స్పష్టం చేశారు.

**విద్యార్థినులతో కలెక్టర్ ముచ్చట:**

అనంతరం విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడి వారి చదువులు, వసతి, భోజనం, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాలికల భద్రత దృష్ట్యా వారికి కరాటే వంటి ఆత్మరక్షణ శిక్షణ ఇప్పించాలని అధికారులను ఆదేశించారు. గురుకులాల్లో చదువుతో పాటు విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. తహసీల్దార్ హనుమంతు శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో నర్రా వేజన, సర్పంచ్ రవి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్కూల్ బస్సుల్లో భద్రతా ప్రమాణాలు తప్పనిసరి






- విద్యార్థుల సురక్షిత ప్రయాణమే ప్రథమం
- యాజమాన్యాలు, డ్రైవర్లకు అధికారుల సూచనలు


**తొలివెలుగు, రామన్నపేట :** విద్యార్థులను పాఠశాలకు సురక్షితంగా చేర్చడం, తిరిగి ఇళ్లకు తీసుకెళ్లడం ప్రైవేట్ యాజమాన్యాలు, బస్సు డ్రైవర్ల ప్రాథమిక బాధ్యత అని మండల విద్యాధికారి (ఎంఈఓ) టి.సురేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. పాఠశాల బస్సుల్లో భద్రతా ప్రమాణాలపై జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు.. బుధవారం రామన్నపేట మండల వనరుల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులు, డ్రైవర్లతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. బస్సుల్లో విద్యార్థుల సంరక్షణ నిమిత్తం తప్పనిసరిగా ఒక ఉపాధ్యాయుడు లేదా ఆయా ఉండాలన్నారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అనంతరం స్థానిక ఏఎస్ఐ సురేందర్ మాట్లాడుతూ.. ప్రతి పాఠశాల బస్సు ఆర్టీఏ నిబంధనలకు అనుగుణంగా ఉండాలని సూచించారు. బస్సు కండిషన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, మితిమీరిన వేగంతో నడిపితే కఠిన చర్యలు తప్పవని డ్రైవర్లను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానో పాధ్యాయులు శేఖర్, డి.స్వామి, ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, హెచ్‌ఎంలు టి.మల్లికార్జున్, జె.వి.ఎస్.ఎన్.మణి, మార్టిన్, దీప లీల, నాగరాజు, ఖదీర్, శ్రీధర్, జె.కనకాచారి పాల్గొన్నారు.



# వెల్లంకిలో బెల్ట్ షాపుల బంద్

- సెప్టెంబరు 1 నుంచి విక్రయాలపై నిషేధం
- ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు
- గ్రామసభ, అఖిలపక్షం ఏకగ్రీవ తీర్మానం

**తొలివెలుగు, రామన్నపేట :** మండలంలోని వెల్లంకి గ్రామ పరిధిలో బెల్టు షాపులను పూర్తిగా నిషేధిస్తూ గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు బుధవారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామ సర్పంచ్ ఇడెం రాధ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. గ్రామ ప్రజలు, యువత ఆరోగ్యం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారి నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి గ్రామ పరిధిలో ఎవరైనా మద్యం విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బెల్టు షాపుల ద్వారా మద్యం అమ్మకాలను అరికట్టాలని కోరుతూ జిల్లా కలెక్టర్, జిల్లా, మండల ఎక్సైజ్ అధికారులు, రామన్నపేట సీఐ, ఎస్ఐలకు తీర్మాన కాపీలతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇడెం శ్రీనివాస్, వార్డు సభ్యులు సండ్ర లింగయ్య, జువ్వగోని మల్లమ్మ, జింక శాంతి, మొగిలి భాగ్యలక్ష్మి, గంజి భాస్కర్, కన్నెబోయిన రాజలింగం, అఖిలపక్ష నాయకులు పర్నే వెంకట్‌రెడ్డి, ఆవనగంటి నగేష్, పున్న వెంకటేశం, కర్రె సంతోష్, బర్ల బాబురావు, నకిరేకంటి మహేష్, తాటిపాముల లింగస్వామి, గూని రాజు, గూడెల్లి దామోదర్, నకిరేకంటి నరేందర్, పాశం సతీష్, నకిరేకంటి గణేష్, గుర్రం మహేష్ తదితరులు పాల్గొన్నారు.



# యాదాద్రి వైద్య కళాశాలలో పోస్టుల భర్తీ

- కాంట్రాక్ట్ పద్ధతిన ప్రొఫెసర్, అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు
- ఈ నెల 25న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు

**తొలివెలుగు, భువనగిరి :** యాదాద్రి భువనగిరి జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో పలు పోస్టులను కాంట్రాక్ట్, పారితోషిక (హానరోరియం) పద్ధతిన భర్తీ చేయనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.విజయ సారధిని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి మేరకు ఈ నియామకాలు చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఖాళీల వివరాలు చూస్తే.. ప్రొఫెసర్– 8, అసోసియేట్ ప్రొఫెసర్– 12, అసిస్టెంట్ ప్రొఫెసర్– 17, సివిల్ అసిస్టెంట్ సర్జన్ (బ్లడ్ బ్యాంక్)– 1 పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిన భర్తీ చేయనున్నారు. అలాగే ట్యూటర్– 1 పోస్టును హానరోరియం పద్ధతిన భర్తీ చేస్తారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కళాశాల కార్యాలయంలో నిర్వహించే 'వాక్–ఇన్ ఇంటర్వ్యూ'లకు హాజరుకావాలని సూచించారు. అభ్యర్థులు తమ విద్యార్హత, అనుభవ, రిజిస్ట్రేషన్ తదితర అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలను వెంట తీసుకురావాలన్నారు. వేతనం, ఖాళీల కేటాయింపు, ఇతర పూర్తి వివరాలకు www.gmcyadadri.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

# ఎంఆర్‌పీఎస్ రామన్నపేట మండల అధ్యక్షుడిగా చిరంజీవి

- వరుసగా రెండోసారి బాధ్యతల అప్పగింపు
- నియామక పత్రం అందజేసిన నాయకులు

**తొలివెలుగు, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండల ఎంఆర్‌పీఎస్ అధ్యక్షుడిగా నోముల చిరంజీవి రెండోసారి నియమితులయ్యారు. బుధవారం రామన్నపేటలో జరిగిన ఒక కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకులు బిర్రు మహేంద్ర మాదిగ, దుబ్బ రామకృష్ణ (అధ్యక్షుడు) చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవిని పలువురు నాయకులు, కార్యకర్తలు సత్కరించి అభినందనలు తెలిపారు. మండలంలో ఎంఆర్‌పీఎస్ బలోపేతానికి, సంఘ ఆశయ సాధనకు ఆయన మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు. వరుసగా రెండోసారి మండల అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నోముల చిరంజీవితో పాటు, నూతనంగా ఎన్నికైన మండల శాఖ కమిటీ సభ్యులకు పలువురు నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.





# మళ్లీ విధుల్లోకి తీసుకోండి

- అధికారులకు ఫీల్డ్ అసిస్టెంట్ల వినతి
- 13 ఏళ్ల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి



**తొలివెలుగు, రామన్నపేట:** జాతీయ ఉపాధి హామీ పథకంలో గతంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేసిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని పలువురు మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు అధికారులను కోరారు. ఈ మేరకు బుధవారం రామన్నపేట ఎంపీడీవో ఏ. రాములు, ఏపీవో వెంకన్నలను కలిసి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నీర్నెముల గ్రామానికి చెందిన బాలరాజు, రామన్నపేట పట్టణానికి చెందిన చెరుకు సత్యనారాయణ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2006 నుంచి 2019 వరకు సుమారు 13 సంవత్సరాల పాటు ఉపాధి హామీ పథకంలో తాము ఫీల్డ్ అసిస్టెంట్లుగా విధులు నిర్వహించామన్నారు. అయితే, జాబ్‌కార్డుల్లో పనిదినాలు 10 శాతానికి తగ్గిన కారణంగా తమను విధుల నుంచి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం తాము అందించిన సేవలు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని ఉపాధి హామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్లుగా తిరిగి అవకాశం కల్పించాలని వారు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

# అనారోగ్యంతో యువకుడి బలవన్మరణం

- పెద్ద రావులపల్లి శివారులో ఘటన
- మృతుడు బట్టుగూడెం వాసి

**తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి:** అనారోగ్య సమస్యలు తాళలేక ఓ యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పెద్ద రావులపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఎస్ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం బట్టుగూడేనికి చెందిన కోరే మధు (30) తీవ్రమైన మధుమేహంతో (షుగర్ వ్యాధి) బాధపడుతున్నాడు. వ్యాధి తీవ్రత కారణంగా రోజూ ఇన్సులిన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో పాటు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. అనారోగ్య బాధలు భరించలేక బుధవారం పెద్ద రావులపల్లి శివారులోని ఓ కుంకుడు చెట్టుకు చీరతో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి తండ్రి నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ వెల్లడించారు.

# సైబర్ వల.. జర భద్రం

- సీనియర్ సిటిజన్లకు సైబర్ జాగరూకత సదస్సు
- సూచించిన మల్కాజిగిరి సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి

**తొలివెలుగు, నాగోల్ :** సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి సైబర్ క్రైమ్ డీసీపీ నాగలక్ష్మి సూచించారు. 'సైబర్ జాగరూకత దివస్'ను పురస్కరించుకుని నాగోల్ పోలీస్ స్టేషన్‌లో సీనియర్ సిటిజన్లకు సైబర్ నేరాలపై బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల సైబర్ మోసాల గురించి అధికారుల బృందం వివరించింది. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న డిజిటల్ అరెస్ట్ మోసాలు, పెట్టుబడులు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల పేరిట జరిగే మోసాలపై అవగాహన కల్పించారు. ఓఎల్ఎక్స్, ఆన్‌లైన్ షాపింగ్, కస్టమర్ కేర్, రుణాలు, మ్యాట్రిమోనియల్ తదితర పేర్లతో జరిగే మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే ఓటీపీ, యూపీఐ మోసాలు, ఫిషింగ్ వంటి అంశాలను వివరిస్తూ.. ఇంటర్నెట్, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ శివశంకర్ గౌడ్, నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, ఎస్సైలు పి.శివనాగప్రసాద్, మమతారెడ్డిలతో పాటు సుమారు 60 మంది సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.




# గతానికి సజీవ సాక్ష్యం.. ఫొటోగ్రఫీ




- భవిష్యత్ తరాలకు జ్ఞాపకాలందిస్తున్న ఫొటోగ్రాఫర్లు
- ర్యాలీని ప్రారంభించిన ఎస్ఐ జగన్
- ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం


**తొలివెలుగు, భూదాన్‌పోచంపల్లి :** భవిష్యత్ తరాలకు జ్ఞాపకాలను పదిలంగా అందించే ఫొటోగ్రఫీ కళ ఎంతో గొప్పదని స్థానిక ఎస్ఐ జగన్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం (లూయిస్ డాగురె 187వ జయంతి) సందర్భంగా బుధవారం భూదాన్‌పోచంపల్లి పురపాలక కేంద్రంలో మండల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్ఐతో పాటు సంఘం జిల్లా అధ్యక్షుడు భోగ చంద్రశేఖర్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా మండల అధ్యక్షుడు కేమ విష్ణుమూర్తి ఫొటోగ్రఫీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఫొటోగ్రాఫర్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన శాఖ కార్యాలయాన్ని జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ ప్రారంభించారు. మానవత్వాన్ని చాటుకుంటూ.. ఇటీవల మృతి చెందిన మండల ఫొటోగ్రాఫర్లు చెక్క రమేష్, ఎలగందుల సత్యనారాయణ కుటుంబాలకు మండల కమిటీ తరఫున నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్ దోర్నాల కరుణాకర్, జిల్లా కార్యదర్శి రచ్చ రాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చింతల రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి రవ్వ నవీన్, ఉపాధ్యక్షుడు చెక్క మల్లేష్, కోశాధికారి సకినాల సిద్దేశ్వర్, సహాయ కార్యదర్శి దొడ్డమోని వంశీధర్, గౌరవ సలహాదారు రచ్చ వినోద్, కార్యవర్గ సభ్యులు ఏ. విఘ్నేష్, వంగూరి నరేష్, మాజీ అధ్యక్షులు దోర్నాల గణేష్, గుద్దేటి పాండు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

- రాజపేటలో జెండా ఆవిష్కరణ
- ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి

**తొలివెలుగు, రాజపేట :** రాజపేట మండల కేంద్రంలో బుధవారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఫొటోగ్రాఫర్, వీడియోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముందుగా కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాగురె చేసిన సేవలను వారు కొనియాడారు. అనంతరం మండల అధ్యక్షుడు కటకం శ్రీనివాస్ ఫొటోగ్రఫీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న ఫొటో, వీడియోగ్రాఫర్లను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వేడుకల అనంతరం ఒకరికొకరు స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు బిర్రు శ్రీనివాస్, కోశాధికారి ఎలగందుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు భరత్ మల్యాల, ప్రధాన కార్యదర్శి బూడిద నరేష్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు చాట్లపల్లి సిద్ధులు, రామకృష్ణ, నరసింహులు, పాండు, నవీన్, కరుణాకర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# ఇన్సూరెన్స్ పేరిట కుచ్చుటోపీ

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి రూ.78,947 టోకరా
- క్రెడిట్ కార్డు వివరాలు సేకరించి సైబర్ వల

**తొలివెలుగు, ఎల్బీనగర్ :** ఇన్సూరెన్స్ పేరిట క్రెడిట్ కార్డు వివరాలు సేకరించి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఖాతా నుంచి రూ.78,947 కాజేసిన సైబర్ నేరం హస్తినాపురం పరిధిలో వెలుగుచూసింది. పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపురం సరస్వతి నగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వియాపు శ్రీను (25)కు ఈ నెల 15న మధ్యాహ్నం 2:15 గంటల సమయంలో 6289043934 నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి ఇన్సూరెన్స్ పేరుతో మాటల్లో పెట్టి "ఱఅంబతీుఱఅషవ ఎఎ ఖఇఱం.ఎశీఎ" అనే నకిలీ వెబ్‌సైట్ ద్వారా శ్రీను క్రెడిట్ కార్డు వివరాలను సేకరించాడు. క్షణాల వ్యవధిలోనే ఆ కార్డు నుంచి విడతలవారీగా రూ.78,947 డెబిట్ అయినట్లు మెసేజ్ వచ్చింది. తాను మోసపోయానని గ్రహించిన బాధితుడు బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఐ గంగాధర్ తెలిపారు.

# మాదిగల హక్కుల సాధనకే నా కృషి

- చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యం కల్పించాలి
- ఎల్బీనగర్ ఎంఆర్‌పీఎస్ ఇన్‌ఛార్జిగా కొమ్ము రాజశేఖర్ మాదిగ

**తొలివెలుగు, ఎల్బీనగర్:** ఎల్బీనగర్ నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) ఇన్‌ఛార్జిగా కొమ్ము రాజశేఖర్ మాదిగ నియమితులయ్యారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు ఆయనను నియమిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా ఇన్‌ఛార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాదిగ మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా ఎంఆర్‌పీఎస్‌లో పనిచేస్తున్న తనకు ఎల్బీనగర్ బాధ్యతలు అప్పగించిన మందకృష్ణ మాదిగకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జనాభా ప్రాతిపదికన మాదిగలకు విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు, చట్టసభల్లోనూ తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో ఎంఆర్‌పీఎస్ బలోపేతానికి, సంఘం విస్తరణకు తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.



# పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రామన్నపేటలో కార్మికుల నిరసన దీక్ష
- ఎంపీడీవో ఆవుల రాములుకు వినతిపత్రం అందజేత

**తొలివెలుగు, రామన్నపేట:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జీపీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకరికంటి రాము డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రామన్నపేట మండల కేంద్రంలో బుధవారం కార్మికులు ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా నకరికంటి రాము మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో నమోదు కాని పంచాయతీ కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలని కోరారు. జీవో నంబర్ 51ను రద్దు చేయడంతో పాటు నాలుగో లేబర్ కోర్టులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

**కార్మికుల ప్రధాన డిమాండ్లు:**

- ప్రతి కార్మికుడికి రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలి.
- రెండో పీఆర్‌సీని కార్మికులందరికీ వర్తింపజేయాలి.




- జీవో నంబర్ 51ను సవరించాలి.
- ప్రతి కార్మికుడికి పోస్టల్ జీవిత బీమా సౌకర్యం కల్పించాలి.
- ఆన్‌లైన్‌లో నమోదు కాని కార్మికుల పేర్లను వెంటనే నమోదు చేయాలి.

అనంతరం కార్మికులు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఆవుల రాములుకు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల భిక్షం, మండల అధ్యక్షుడు గాదె ఎల్లయ్య, బొడ్డు సాలయ్య, దాసు నాగరాజు, సాయిలు, వీరేశం, బచ్చ లింగస్వామి, గడ్డం ఎల్లయ్య, నల్ల సుగుణమ్మ, చిత్రకంటి శోభ, భారతమ్మ, కవిత, ప్రమీల, మంగమ్మ, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ ఆసరా

- మృతురాలి కుటుంబ సభ్యులకు 50 కిలోల బియ్యం పంపిణీ
- పాల్గొన్న బీర్ల ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత

**తొలివెలుగు, రాజాపేట:** రాజాపేట మండల కేంద్రానికి చెందిన బైకని బాలమ్మ ఇటీవల మృతి చెందగా.. ఆమె కుటుంబానికి బీర్ల ఫౌండేషన్ అండగా నిలిచింది. ఫౌండేషన్ చైర్‌పర్సన్ బీర్ల అనిత బుధవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం వారికి 50 కిలోల బియ్యాన్ని సాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నేమిల మహేందర్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు పిండికూర మహేష్, నాయకులు రేగు సిద్ధులు, దోమల బాలపోచయ్య, రేగు శ్రీశైలం, వార్డు సభ్యుడు గుర్రం శ్రవణ్, గొల్లన స్వామి, దోమల పాండు, లక్ష్మణ్, కాకళ్ల రామచంద్రం, మల్లేశం, ఐలయ్య, ఉపేందర్, కనకయ్య, నరసయ్య తదితరులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సన్న రకాల సాగు.. యాప్‌లో నమోదు తప్పనిసరి

- 7 రకాల వరి వంగడాలకు వర్తింపు
- నమోదు చేసుకుంటేనే రూ.500 బోనస్
- రాజాపేట వ్యవసాయ అధికారిణి పద్మజ వెల్లడి



**తొలివెలుగు, రాజాపేట :** వానాకాలం సీజన్‌లో సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా 'సీడ్ డీటెయిల్స్' యాప్‌లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని రాజాపేట మండల వ్యవసాయ అధికారిణి పద్మజ సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ సన్న రకాల వరి సాగు చేస్తున్న రైతులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన సాంబ మసూరి, హెచ్‌ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం-1638, కేఎన్ఎం-7715, ఆర్ఎన్ఆర్-1548 (తెలంగాణ సోనా), డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి) రకాలను మాత్రమే సన్న రకాలుగా పరిగణిస్తారని ఆమె వెల్లడించారు. మండల పరిధిలోని ఎరువుల దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ల వద్దే 'సీడ్ డీటెయిల్స్' యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇతర ప్రాంతాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు ఒరిజినల్ బిల్లులతో స్థానిక వ్యవసాయ విస్తరణ అధికారులను (ఏఈఓ) సంప్రదించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని తెలిపారు. యాప్‌లో సకాలంలో నమోదు చేసుకున్న రైతులకే ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్ అందుతుందని పద్మజ స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవడం ద్వారా ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. సన్న రకాల సాగు చేస్తున్న రైతులంతా తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆమె కోరారు.

## 94 ఏళ్ల వయసులో.. యాదాద్రి గిరి ప్రదక్షిణ!

- వీల్‌చైర్‌లో వచ్చి స్వామివారికి మొక్కులు
- కుటుంబ సభ్యుల సహకారంతో గిరి ప్రదక్షిణ పూర్తి
- భక్తులకు ఆదర్శంగా నిలిచిన వృద్ధురాలు ప్రమీల

**రాజాపేట:** భక్తికి వయసుతో సంబంధం లేదని రాజాపేట మండలం బసంతపురం గ్రామానికి చెందిన 94 ఏళ్ల వృద్ధురాలు పిన్నపురెడ్డి ప్రమీల నిరూపించారు. యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి జన్మ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన గిరి ప్రదక్షిణలో ఆమె పాల్గొని భక్తిశ్రద్ధలు చాటుకున్నారు. వయోభారం కారణంగా నడవలేని పరిస్థితి ఉన్నప్పటికీ స్వామివారిపై ఉన్న అపారమైన భక్తితో కుటుంబ సభ్యుల సహకారంతో వీల్‌చైర్‌లో గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. ఆమె పెద్ద కుమారుడు పిన్నపురెడ్డి సత్యనారాయణరెడ్డి, కోడలు శోభ సహకారంతో గిరి ప్రదక్షిణను పూర్తి చేశారు. అనంతరం యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. "స్వామివారి ఆశీస్సులతోనే ఈ వయసులోనూ గిరి ప్రదక్షిణ చేయగలిగాను. మళ్లీ స్వామివారిని దర్శించుకుంటాను" అని ప్రమీల భక్తిభావంతో తెలిపారు. 94 ఏళ్ల వయసులోనూ ఆమె చూపిన భక్తి, పట్టుదలను తోటి భక్తులు అభినందించారు. కుటుంబ సభ్యుల సహకారంతో గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ప్రమీల పలువురికి భక్తికి వయసు అడ్డంకి కాదనే స్ఫూర్తిని అందించారు.



# జన్నారంలో 'ల్యాబ్' దందా.. నిబంధనలకు తిలోదకాలు!

- అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండానే డయాగ్నస్టిక్ కేంద్రాల నిర్వహణ?
- బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై నిర్లక్ష్యం.. అధికారుల తనిఖీలు ఏవీ?
- కమిషన్ల ఆరోపణలపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్




**తొలివెలుగు, జన్నారం:** వైద్య పరీక్షల పేరుతో జన్నారం మండల కేంద్రంలో కొన్ని ప్రైవేట్ డయాగ్నస్టిక్ ల్యాబొరేటరీలు నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. సరైన అనుమతులు, రిజిస్ట్రేషన్, అర్హత కలిగిన సిబ్బంది, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశాలపై అధికారులు సమగ్రంగా తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

### అనుమతులు ఉన్నాయా.. తనిఖీలు చేస్తున్నారా?

ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రాలు నిబంధనల ప్రకారం అవసరమైన రిజిస్ట్రేషన్లు, అనుమతులు కలిగి ఉండాల్సి ఉంటుంది. అయితే జన్నారంలో కొన్ని ల్యాబ్‌ల నిర్వహణపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయా కేంద్రాల్లో అర్హత కలిగిన సాంకేతిక సిబ్బంది ఉన్నారా? పరీక్షలు నిర్వహిస్తున్న విధానం, పరికరాల ప్రమాణాలు, రిపోర్టుల జారీ ప్రక్రియ నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు అంటున్నారు.

### బయోమెడికల్ వ్యర్థాలపై నిర్లక్ష్యం?

డయాగ్నస్టిక్ ల్యాబ్‌ల నుంచి వెలువడే రక్త నమూనాలు, సూదులు, సిరంజీలు, ఇతర వైద్య వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా నిబంధనల ప్రకారం సేకరించి, భద్రపరచి, అధీకృత విధానంలో నిర్వీర్యం చేయాల్సి ఉంటుంది. అయితే కొన్ని ల్యాబ్‌లలో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణపై సరైన పర్యవేక్షణ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనివల్ల ప్రజారోగ్యం, పర్యావరణానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### అర్హత లేని సిబ్బందితో పరీక్షల ఆరోపణలు:

కొన్ని కేంద్రాల్లో తగిన అర్హతలు లేని వ్యక్తులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. పరీక్షల నాణ్యత, రిపోర్టుల ఖచ్చితత్వం, వాటిని ధ్రువీకరించే విధానంపై అధికారులు విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తప్పు నిర్ధారణల కారణంగా రోగులకు సరైన చికిత్స అందకపోతే తీవ్ర పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని వారు పేర్కొంటున్నారు.

### '50-50' కమిషన్ల ఆరోపణలపై విచారణ కోరుతున్న ప్రజలు:

కొన్ని ప్రైవేట్ ల్యాబ్‌లు, క్లినిక్‌ల మధ్య పరీక్షల విషయంలో కమిషన్ల వ్యవహారం సాగుతోందనే ఆరోపణలు కూడా చర్చకు వస్తున్నాయి. అవసరం లేని పరీక్షలను సైతం రోగులకు సూచించి, ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారిక నిర్ధారణ కావాల్సి ఉండటంతో సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

### ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి:

జన్నారం మండల కేంద్రంలోని ప్రైవేట్ డయాగ్నస్టిక్ ల్యాబ్‌లపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు, రిజిస్ట్రేషన్లు, సిబ్బంది అర్హతలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ, పరీక్షల నాణ్యత తదితర అంశాలను పరిశీలించి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే విధంగా ఎలాంటి అక్రమ కార్యకలాపాలు ఉన్నా వాటిని అరికట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## యజమాని వాట్సాప్ డీపీతో మెసేజ్.. రూ.కోటి కొట్టేసిన నేరగాళ్లు

**10 రోజుల్లోనే బాధితుడికి పోగొట్టుకున్న డబ్బును ఇప్పించిన పోలీసులు**

యజమాని పేరుతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ సృష్టించి రూ.కోటి నగదును కాజేసిన కేసులో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. యూపీలోని లక్నోకు చెందిన 37 ఏళ్ల దీపక్ కుమార్‌ను అరెస్ట్ చేసి, న్యాయపరమైన ప్రక్రియ ద్వారా మోసపోయిన మొత్తం రూ.కోటిని బాధితుడికి తిరిగి అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు బుధవారం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో విలేకరుల సమావేశంలో సీపీ ఎం.రమేష్ కేసు పూర్వాపరాలను వెల్లడించారు... ఆగస్టు 4 న ఓ చీరల రిటైల్ సంస్థలో పనిచేస్తున్న అకౌంటెంట్‌కు సంస్థ యజమాని పేరుతో నకిలీ వాట్సాప్ ప్రొఫైల్ నుంచి ఆర్థిక సహాయం కోరుతూ సందేశం వచ్చింది.






## పీపల్‌పహాడ్‌లో జ్ఞాన వెలుగులు

- సాయి సేవా ధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన గ్రంథాలయం ప్రారంభం
- ప్రారంభించిన సర్పంచ్ పులనగారి నాగేశ్వరి అశ్విన్‌కుమార్ గౌడ్

**తొలివెలుగు, చౌటుప్పల్ :** గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువతలో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఉపయోగపడేలా సాయి సేవా ధర్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని బుధవారం గ్రామ సర్పంచ్ పులనగారి నాగేశ్వరి అశ్విన్‌కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పలువురు అతిథులు పాల్గొని ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాల ఏర్పాటు విద్యార్థులు, యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు పోటీ పరీక్షల్లో రాణించేందుకు గ్రంథాలయం దోహదపడుతుందని తెలిపారు. గ్రామంలో గ్రంథాలయం అందుబాటులోకి తీసుకురావడంలో ట్రస్ట్ నిర్వాహకులు చేసిన కృషిని అభినందించారు. కార్యక్రమానికి గ్రంథాలయ చైర్మన్ అనుమల శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, గౌరవ అతిథిగా నేలంటి మధు, ఆత్మీయ అతిథిగా ఆందోజు నాగభూషణం పాల్గొన్నారు. ట్రస్ట్ నిర్వాహకులు ఊడుగు రాములు గౌడ్, బోగ నాగభూషణం, ఏఓ నాగరాజుల చొరవతో గ్రామంలో గ్రంథాలయం అందుబాటులోకి వచ్చింది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు యర్ర మహేష్, గట్టు మల్లేష్, యర్ర పూజ పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



## సిద్దిపేట జిల్లాలో విషాదం.. బావిలోకి దూసుకెళ్లిన కారు నలుగురు మృతి

సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. కారు అదుపుతప్పి రహదారి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలోకి(ఔవశ్రీశ్రీ) దూసుకెళ్లిన ప్రమాదంలో( ఝుతీ ఖఎఎఱ-ఎవత్) ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. ఈవిషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లి శివారులో అర్ధరాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుబ్బాక మండలంలోని బలవంతాపూర్ గ్రామానికి చెందిన దండుగుల రాజు (30), అతని భార్య భాగ్య (25), కుమారుడు నిహాన్ష్ (4), కుమార్తె శాన్విక (2)తో కలిసి సిద్దిపేట నుంచి తమ స్వగ్రామానికి కారులో వస్తుండగా బుధవారం అర్ధరాత్రి సమయంలో అదుపుతప్పి బావిలో పడిపోయారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది జేసీబీ సహాయంతో బావిలో నుంచి కారును, నలుగురి మృతదేహాలను వెలికితీశారు. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు దుర్మరణం చెందడంతో బలవంతాపూర్, అప్పనపల్లి గ్రామాల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

## రూ.16.40 లక్షల డ్రగ్స్ స్వాధీనం.. ముగ్గురు డ్రగ్ పెడ్లర్లు అరెస్ట్

డ్రగ్స్ విక్రయిస్తున్న ముఠాపై గచ్చిబౌలి, సైబరాబాద్ ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి ముగ్గురు డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.16.40లక్షల విలువ చేసే 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేయడంతో పాటు 16 మంది డ్రగ్ వినియోగదారులను కూడా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. బుధవారం సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లో విలేకరుల సమావేశంలో శేరిలింగంపల్లి జోన్ డీసీపీ సీహెచ్.శ్రీనివాస్, ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్‌తో కలిసి కేసు పూర్వాపరాలను వెల్లడించారు. వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డులో డ్రగ్స్ వినియోగం జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఓటి, గచ్చిబౌలి పోలీసులు ఈనెల 11న సంయుక్తంగా దాడులు జరిపారు. ఈ దాడుల్లో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్ట్ చేశారు. అలాగే 16 మంది డ్రగ్ వినియోగదారులను సైతం అరెస్ట్ చేసారు. పోలీసులకు పట్టుబడిన యశ్వంత్‌ను విచారించగా కేరళకు చెందిన మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్, బెంగళూరుకు చెందిన నవీనా కేడీ నుంచి ఎండీఎంఏ కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. దీంతో పోలీసు బృందాలు కేరళ, బెంగళూరుకు చేరుకుని నిందితుల కోసం గాలింపు చేపట్టి, ఈ నెల 18న త్రిస్సూర్‌లో మహ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా యశ్వంత్‌కు 44.41 గ్రాముల ఎండీఎంఏ విక్రయించినట్లు అంగీకరించాడు. ఈ డ్రగ్‌ను 'సామ్ ' అనే నైజీరియన్ వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడించాడు. దీంతో పోలీసులు అతడిని అరెస్టు చేశారు. అదే రోజు బెంగళూరులోని బేగూర్‌లో నవీనా కేడీని పోలీసులు అరెస్ట్ చేశారు.



## కుమార్తె పొలిటికల్ ఎంట్రీపై కీలక ప్రకటన చేసిన బొత్స సత్యనారాయణ

**స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కూతురు పోటీ చేస్తుందన్న బొత్స**

**జిల్లా పరిషత్ ఎన్నికల్లో బరిలోకి దింపుతామని వెల్లడి**

**అసెంబ్లీలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని విమర్శ**

తన కుమార్తె అనూష రాజకీయ అరంగేట్రంపై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కీలక ప్రకటన చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తన కుమార్తె పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. జిల్లా పరిషత్ ఎన్నికల్లో అనూషను బరిలోకి దించుతున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై కూటమి ప్రభుత్వంపై బొత్స తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శాసనసభలో కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని, బయట మాత్రం మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. డీఎస్సీ అంశంపై తక్షణమే సీబీఐ విచారణ జరిపించాలని, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటీ చైర్మన్ ఎన్నిక సమయంలో అధికార పక్షం బయటకు వెళ్లడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని, రాష్ట్ర చరిత్రలోనే ఇదొక కొత్త విపరీత సంప్రదాయమని విమర్శించారు. ఐదు కోట్ల మంది ప్రజలకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వం ఒంటెద్దు పోకడలతో ప్రవర్తిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షికి బెయిల్..

వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షికి న్యాయస్థానంలో స్వల్ప ఊరట లభించింది. ఆయనపై నమోదైన మూడు కేసుల్లో ఒకటైన హత్యాయత్నం కేసులో కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఇతర కేసుల్లో ఇంకా బెయిల్ రాకపోవడంతో ఆయన జైలు నుంచి విడుదల కాలేదు. ప్రస్తుతం విరూపాక్షి కర్నూలు కారాగారంలోనే రిమాండ్‌లో ఉన్నారు. ఈ హత్యాయత్నం కేసులో మొత్తం 35 మందిని నిందితులుగా చేర్చగా, వారిలో ఎమ్మెల్యేతో సహా 28 మందికి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. ఇటీవల కర్నూలు జిల్లా చిప్పగిరిలో వైసీపీ, టీడీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఈ గొడవలో ఎమ్మెల్యే విరూపాక్షి, ఆయన అనుచరులు తనపై దాడి చేసి, కారును ధ్వంసం చేశారని టీడీపీ మండల అధ్యక్షుడు పురుషోత్తం ఆరోపించారు. ఇదే ఘటనలో సుచిత్ర అనే దళిత మహిళపై కూడా దాడి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యేపై హత్యాయత్నం, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతరం ఆయనను అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. హత్యాయత్నం కేసులో బెయిల్ లభించినప్పటికీ, అట్రాసిటీ కేసు పెండింగ్‌లో ఉండటంతో ఆయన ప్రస్తుతం జైలులోనే ఉండాల్సి వస్తోంది.

## జ్ఞాపకాలను బంధించే అద్భుత కళ.. ఫొటోగ్రఫీ


- **చౌటుప్పల్‌లో ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం**
- **రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసిన ఫొటోగ్రాఫర్లు**



**తొలివెలుగు, చౌటుప్పల్:** తెలంగాణ ఫొటో వీడియోగ్రాఫర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చౌటుప్పల్ మండల కేంద్రంలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు సుక్క స్వామి జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఫొటోగ్రఫీ కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, జీవితంలోని చిరునవ్వులు, మధుర జ్ఞాపకాలను కెమెరా ద్వారా సజీవంగా భద్రపరిచే అద్భుతమైన కళ అని అన్నారు. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా ఫొటోగ్రాఫర్లు నూతన నైపుణ్యాలను అలవర్చుకోవాలని సూచించారు.

**రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ:**

ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఫొటోగ్రాఫర్లు సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడ చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమం ద్వారా తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కాటం రాజు, జిల్లా సలహాదారులు విశ్వనాథ్ చంద్రశేఖర్, రవీందర్, చౌటుప్పల్ మాజీ అధ్యక్షుడు తోర్పునూరి సాయిలు గౌడ్, సీనియర్ ఫొటోగ్రాఫర్లు చింతల గణేష్, కందగట్ల కృష్ణ, మెట్టు రామచంద్ర రెడ్డి, జక్కా చలమందరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వనం రుషి, కోశాధికారి రోషణగారి రాఘవేంద్ర గౌడ్, ఉపాధ్యక్షులు ఎర్ర శివ, వరికుప్పల మహేష్, పల్లెర్ల సుజిక్, ప్రచార కార్యదర్శి పగడాల శంకర్, కార్యవర్గ సభ్యులు మలిగే రవి, పగిళ్ల మహేష్, దాకోజి నాని, జాజుల రామకృష్ణ, పెడకంటి నాగేందర్, సంతోష్, ప్రవీణ్, రమేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



# గూడూరు జంక్షన్ కష్టాలకు చెల్లుచీటి

**గూడూరు-గుమ్మిడిపూండి మధ్య 3, 4వ రైల్వే లైన్లకు కేంద్ర కేబినెట్ ఆమోదం**

**రూ. 2,229 కోట్ల అంచనా వ్యయంతో 90 కిలోమీటర్ల మేర నిర్మాణం**

**గూడూరు జంక్షన్‌లో రద్దీ తగ్గి, మరిన్ని రైళ్లకు అవకాశం**

**నాలుగేళ్లలో ప్రాజెక్టు పూర్తి.. కృష్ణపట్నం, శ్రీహరికోటలకు మెరుగవనున్న కనెక్టివిటీ**

**నిర్ణయంపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ హర్షం**

ఆంధ్రప్రదేశ్‌కు ప్రయోజనం చేకూర్చే కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. గూడూరు–గుమ్మిడిపూండి మధ్య 90 కిలోమీటర్ల మేర మూడో, నాలుగో రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (జజజూా) బుధవారం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.2,229 కోట్లుగా నిర్ణయించారు. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రస్తుతం డబుల్ లైన్‌గా ఉన్న ఈ మార్గాన్ని నాలుగు లైన్లుగా అప్‌గ్రేడ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గి, మరిన్ని ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపేందుకు వీలవుతుందని వివరించారు. దేశంలో అత్యంత రద్దీగా ఉండే చెన్నై–కోల్‌కతా, ఢిల్లీ–చెన్నై మార్గాలతో పాటు వైజాగ్–చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఈ ప్రాజెక్టు ఎంతో కీలకం కానుంది. ఈ ప్రాజెక్టుకు ఆమోదం లభించడంపై ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, తిరుపతి ఎంపీ గురుమూర్తి హర్షం వ్యక్తం చేశారు. ఈ అదనపు ట్రాక్‌లు ప్రాంతీయ అభివృద్ధికి, ప్రగతికి బాటలు వేస్తాయని పవన్ కల్యాణ్ పేర్కొంటూ కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారానికి చొరవ చూపినందుకు రైల్వే మంత్రికి ఎంపీ గురుమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

**ప్రాజెక్టుతో చేకూరే ప్రయోజనాలు**

ఈ ప్రాజెక్టు పూర్తయితే గూడూరు జంక్షన్‌లో ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుతుంది. చెన్నై, విజయవాడ, తిరుపతి వైపు వెళ్లే రైళ్ల రాకపోకలు సులభతరం అవుతాయి. ముఖ్యంగా




పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల సంరక్షణ కేంద్రం, శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్, కృష్ణపట్నం పోర్టు, శ్రీసిటీ వంటి కీలక ప్రాంతాలకు అనుసంధానం మెరుగుపడుతుంది. ప్రాజెక్టులో భాగంగా స్వర్ణముఖి నదిపై 360 మీటర్ల మెగా బ్రిడ్జితో సహా 21 ప్రధాన వంతెనలు, 127 చిన్న వంతెనలు నిర్మించనున్నారు. సుమారు నాలుగేళ్లలో ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల ఏటా అదనంగా 21 మిలియన్ టన్నుల సరుకు రవాణా సామర్థ్యం పెరగడంతో పాటు, దాదాపు 61 లక్షల పనిదినాల ఉపాధి లభిస్తుందని అంచనా. పీఎం గతి శక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు, మల్టీమోడల్ కనెక్టివిటీని మెరుగుపరచనుంది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మొత్తం రూ.9,450 కోట్ల వ్యయంతో చేపట్టిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులలో ఇది ఒకటి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయితే దేశంలోని తూర్పు, దక్షిణ కారిడార్లలో సరుకు, ప్రయాణికుల రవాణా సామర్థ్యం గణనీయంగా పెరుగుతుంది.

# స్కూల్ బస్సును ఢీకొట్టిన మరో స్కూల్ బస్సు

- **ఎన్‌హెచ్-65పై లక్కారం వద్ద ఘటన.. విద్యార్థుల్లో తీవ్ర భయాందోళన**
- **రెండు బస్సుల్లో కలిపి 40-50 మంది విద్యార్థులు ఉన్నట్లు సమాచారం**
- **అతివేగం, అజాగ్రత్తే ప్రమాదానికి కారణమని స్థానికుల ఆరోపణ**




**తొలివెలుగు, చౌటుప్పల్:** విద్యార్థులతో వెళ్తున్న ఓ స్కూల్ బస్సును మరో స్కూల్ బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటన చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం పరిధిలోని లక్కారం వద్ద విజయవాడ జాతీయ రహదారి (ఎన్‌హెచ్–65)పై బుధవారం చోటుచేసుకుంది. రెండు బస్సులు ఢీకొనడంతో విద్యార్థులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో రెండు బస్సుల్లో కలిపి సుమారు 40 నుంచి 50 మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.

**వెనుక నుంచి ఢీకొట్టిన బస్సు:**

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ పట్టణ కేంద్రానికి చెందిన ఐరా గ్లోబల్ స్కూల్ బస్సు విద్యార్థులతో ముందుగా వెళ్తోంది. అదే సమయంలో పట్టణానికి చెందిన ట్రినిటీ హైస్కూల్ బస్సు వెనుక నుంచి వస్తోంది. ఈ క్రమంలో ట్రినిటీ హైస్కూల్ బస్సు వేగంగా, అజాగ్రత్తగా వచ్చి ముందున్న ఐరా గ్లోబల్ స్కూల్ బస్సును వెనుక వైపు ఢీకొట్టినట్లు స్థానికులు పేర్కొన్నారు.

**విద్యార్థుల కేకలతో కలకలం:**

రెండు బస్సులు ఢీకొన్న సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో బస్సుల్లో ఉన్న విద్యార్థులు భయంతో కేకలు వేసినట్లు ప్రత్యక్షంగా చూసిన వారు తెలిపారు. కొద్దిసేపు ఏం జరిగిందో అర్థంకాక విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ప్రమాద సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు, స్థానికులు ఘటనాస్థలికి చేరుకుని విద్యార్థుల పరిస్థితిని తెలుసుకునేందుకు ఆరా తీశారు.

**ప్రమాదకరంగా మారుతున్న జాతీయ రహదారి:**

చౌటుప్పల్ పట్టణం మీదుగా వెళ్లే ఎన్‌హెచ్–65పై




నిత్యం భారీగా వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం పాఠశాల సమయాల్లో స్కూల్ బస్సులు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ సమయంలో డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉండగా.. అతివేగం, అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**స్కూల్ బస్సులపై తనిఖీలు చేయాలి:**

విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన పాఠశాల యాజమాన్యాలు బస్సుల నిర్వహణ, డ్రైవర్ల నైపుణ్యం, వేగ నియంత్రణ, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని తల్లిదండ్రులు కోరుతున్నారు. చౌటుప్పల్ పరిధిలో విద్యార్థులను తరలిస్తున్న పాఠశాల బస్సులపై సంబంధిత రవాణా, పోలీసు అధికారులు ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల బస్సుల ఫిట్‌నెస్, డ్రైవర్ల డ్రైవింగ్ సామర్థ్యం, వాహనాల వేగ నియంత్రణ, విద్యార్థుల భద్రతకు సంబంధించిన నిబంధనల అమలును పరిశీలించాలని కోరుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# డిప్యూటీ చైర్మన్ ఎన్నిక వేళ ఏపీ శాసనమండలిలో కొత్త వివాదం

ఆంధ్రప్రదేశ్ శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే, ఆయన ఎన్నిక అనంతరం సభలో ఒక అసాధారణ పరిణామం చోటుచేసుకుంది. నూతన డిప్యూటీ చైర్మన్‌ను అధ్యక్ష స్థానానికి తీసుకెళ్లే సంప్రదాయానికి అధికార కూటమి పార్టీల సభ్యులు దూరంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. బుధవారం మండలిలో చైర్మన్ మోషేన్ రాజు, మాధవరావు ఎన్నికను అధికారికంగా ప్రకటించారు. అనంతరం సంప్రదాయం ప్రకారం, అన్ని పార్టీల సభ్యులు కలిసి కొత్త డిప్యూటీ చైర్మన్‌ను చైర్ వద్దకు తీసుకురావాలని కోరారు. అయితే, అధికార పక్ష సభ్యులు ఎవరూ ముందుకు రాకపోవడంతో పాటు సభ నుంచి బయటకు వెళ్లిపోయారు. దీంతో వైసీపీ సభ్యులే ఆయనను అధ్యక్ష స్థానంలో కూర్చోబెట్టారు. ఈ ఘటనపై మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర చరిత్రలోనే ఇలాంటి పరిణామం ఎప్పుడూ జరగలేదని, సభా సంప్రదాయాలను అగౌరవపరచడం సరైన పద్ధతి కాదని ఆయన హితవు పలికారు. "ఇది వెన్నుపోటు పార్టీ తీరును మరోసారి రుజువు చేసింది. మంత్రులు రూల్ బుక్స్ పట్టుకుని నీతులు చెప్పడం కాదు, విలువలు పాటించాలి" అని బొత్స విమర్శించారు. అన్ని పక్షాలను సమదృష్టితో చూడాలని ఈ సందర్భంగా ఆయన చైర్మన్‌ను కోరారు.



# పసిడి, వెండి రివర్స్‌గేర్

న్యూఢిల్లీ: అమెరికా--ఇరాన్ మధ్య యుద్ధానికి రెండు వారాల విరామంపై అంగీకారంతో ర్యాలీ చేసిన పసిడి, వెండి ఒక్క రోజు తిరగకుండానే గురువారం అమ్మకాల ఒత్తిడికి నష్టపోయాయి. కాల్పుల విరమణకు విరుద్ధంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసిందంటూ, ఒప్పందం నుంచి తప్పుకుంటామని ఇరాన్ చేసిన హెచ్చరికలు, హర్మూజ్‌ను మూసేసిందన్న వార్తలతో ముడి చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. ఈ ప్రభావంతో ఢిల్లీ మార్కెట్లో వెండి కిలోకి ఏకంగా రూ.7,800 నష్టపోయి రూ.2.43 లక్షలకు దిగొచి?చంది. అటు బంగారం 10 గ్రాములకు రూ.1,500 తగ్గి రూ.1,54,900 స్థాయికి పరిమితమైంది. 'పశి?చమాసియాలో కాల్పుల విరమణపై ఏర్పడ్డ సందేహాలతో బంగారం, వెండి ముందటి రోజు లాభపడిన స్థాయిలో నష్టపోయాయి. హార్మూజ్ జలసంధిని తిరిగి తెరవడంపై అనిశి?చతులు నెలకొనడం, ట్యాంకర్లు నిలిచిపోయాయన్న సమాచారం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపించింది.దీంతో ఇంధన ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుతుందన్న ఆందోళనలు తిరిగి నెలకొన్నాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే కామెక్స్‌లో స్పాట్ గోల్డ్ ఔన్స్‌కు 12 డాలర్లు పెరిగి 4,789 డాలర్ల వద్ద ఉంటే, వెండి 0.74 డాలర్ల నష్టంతో 74.83 డాలర్ల వద్ద ట్రేడయ్యింది.

## ఒక వైపు 30వేల లేఆఫ్స్..
## మరోవైపు రూ.270 కోట్ల ఆఫర్!



ప్రముఖ టెక్ దిగ్గజం 'ఒరాకిల్' ఇటీవల ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించి వార్తల్లో నిలిచింది. ఇలాంటి సమయంలో కంపెనీ చీఫ్ ఫైనాన్సియల్ ఆఫీసర్ (జఖీూ)గా హిలరీ మ్యాక్సన్‌ను భారీ వేతనంతో నియమించింది. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం సర్వత్రా చర్చకు దారితీసింది. ఒరాకిల్ కొత్త సీఎఫ్ఓ హిలరీ మ్యాక్సన్‌కు కంపెనీ 9,50,000 డాలర్ల జీతం ఇవ్వనుంది. అదనంగా పనితీరు ఆధారంగా 2.5 మిలియన్ డాలర్ల వరకు బోనస్ పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా 26 మిలియన్ డాలర్ల విలువైన ఈక్విటీ (షేర్లు) కూడా సంస్థ అందిస్తుంది. వీటిలో 80 శాతం సమయానికి అనుసంధానమైనవి కాగా, 20 శాతం పనితీరుపై ఆధారపడి ఉంటాయి.మ్యాక్సన్ తన ఈక్విటీని పూర్తిగా స్టాక్ ఆప్షన్ల రూపంలో లేదా స్టాక్ ఆప్షన్లు, రిస్ట్రిక్టెడ్ స్టాక్ యూనిట్ల రూపంలో తీసుకునే అవకాశం ఉంది. అంతేకాకుండా కంపెనీ ఆమెకు 2,50,000 విలువైన రీలోకేషన్ అలవెన్స్ కూడా అందిస్తోంది. ఇవన్నీ కలిగి ఆమె మొత్తం ప్యాకేజీ సుమారు 29.7 మిలియన్ డాలర్లకు (దాదాపు రూ.273 కోట్లు) చేరుకుంటుంది.హిలరీ మ్యాక్సన్ ఒరాకిల్‌లో చేరడానికి ముందు.. ష్నైడర్ ఎలక్ట్రిక్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ సీఎఫ్ఓగా పనిచేశారు. అంతే కాకుండా ఆమె ఏఈఎస్ కార్పొరేషన్‌లో 12 సంవత్సరాలు పాటు ఫైనాన్స్, స్ట్రాటజీ మొదలైన విభాగాల్లో పాటు కీలక బాధ్యతలు నిర్వహించారు.

**కంపెనీ భారీ లేఆఫ్స్**

ఇటీవల ఒరాకిల్ ప్రపంచవ్యాప్తంగా సుమారు 30,000 మంది ఉద్యోగులను తొలగించింది. ఈ భారీ లేఆఫ్ ప్రభావం భారతదేశంలో సుమారు 12,000 మంది ఉద్యోగులపై పడింది. కంపెనీ ఉద్యోగులను తొలగించడానికి ప్రధాన కారణం.. కంపెనీ నిర్మాణ మార్పులు, ఖర్చు తగ్గింపు చర్యలు, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అని తెలుస్తోంది. ఈ కోతలు ఒరాకిల్ హెల్త్, సేల్స్, క్లౌడ్, కస్టమర్ సక్సెస్, నెట్‌సూట్‌లోని సిబ్బందిని ప్రభావితం చేసినట్లు సమాచారం.

## డిస్నీలో లేఆఫ్స్?

### 1,000 మంది ఉద్యోగులపై వేటు

ప్రపంచ వినోద రంగ దిగ్గజం 'వాల్ట్ డిస్నీ' తన ఖర్చులను తగ్గించుకునే పనిలో పడింది. ఇందులో భాగంగా రాబోయే కొద్ది వారాల్లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించాలని కంపెనీ యోచిస్తోంది. ప్రధానంగా కంపెనీలోని మార్కెటింగ్ విభాగంపై ఈ ప్రభావం అధికంగా ఉండనుందని వాల్ స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది.డిస్నీలో జరుగుతున్న ఈ తాజా పరిణామాలు సంస్థ అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగమని తెలుస్తోంది. కొత్తగా నియమితులైన చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ (సీఎంఓ) అసద్ అయాజ్ కంపెనీ మార్కెటింగ్ గ్రూపును ఏకీకృతం చేసే పనిలో ఉన్నారు. 'ప్రాజెక్ట్ ఇమాజిన్' అనే రహస్య కోడ్ పేరుతో వ్యయ నియంత్రణ చర్యలను పర్యవేక్షిస్తున్నారు. జనవరిలో బాధ్యతలు చేపట్టిన అయాజ్ సంస్థలోని అన్ని మార్కెటింగ్ కార్యకలాపాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని భావిస్తున్నారు.కొత్త చేపట్టబోయే లేఆఫ్స్ డిస్నీ మొత్తం శ్రామిక శక్తిలో 1 శాతం కంటే తక్కువే. 2025 ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి డిస్నీలో సుమారు 2,31,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. జోష్ డి అమారో డిస్నీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ)గా బాధ్యతలు స్వీకరించక ముందే ఈ ఉద్యోగాల తగ్గింపు ప్రణాళికలు సిద్ధమైనట్లు సమాచారం.

# మారనున్న హోమ్, పర్సనల్ లోన్




హోమ్ లోన్, పర్సనల్ లోన్ లేదా ఎంఎస్ఎంఈ లోన్ తీసుకున్నప్పుడు వడ్డీ రేటు పెరిగినా, తగ్గినా దాని ప్రభావం నేరుగా ఈఎంఐపై పడుతుంది. అయితే.. చాలా సందర్భాల్లో బ్యాంకులు వడ్డీ రేటును ఎప్పుడు, ఎలా మారుస్తున్నాయో సాధారణ కస్టమర్‌కు పూర్తిగా అర్థం కావడం కష్టం. ఈ సమస్యను తగ్గించడంతో పాటు.. వడ్డీ రేట్ల విషయంలో మరింత పారదర్శకత తీసుకురావడానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ) కొత్త డ్రాఫ్ట్ మార్గదర్శకాలను ప్రతిపాదించింది. ప్రస్తుతం ఇవి ప్రతిపాదనలుగా మాత్రమే ఉన్నాయి. ఆర్బీఐ సెప్టెంబర్ 11, 2026 వరకు ప్రజలు, బ్యాంకులు, ఇతర సంస్థల నుంచి అభిప్రాయాలను కోరుతోంది. ఈ నిబంధనలకు తుది ఆమోదం లభిస్తే.. 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. కొత్త నిబంధనల ప్రకారం.. వాణిజ్య బ్యాంకులు ఇచ్చే ఫ్లోటింగ్ రేట్ పర్సనల్, హోమ్, ఎంఎస్ఎంఈ రుణాలను ఆర్బీఐ రెపో రేట్ లేదా ట్రెజరీ బిల్లుల వంటి బాహ్య బెంచ్‌మార్క్‌లకు అనుసంధానం చేయాల్సి ఉంటుంది. సింపుల్‌గా చెప్పాలంటే.. బ్యాంకు తనకు నచ్చిన విధంగా వడ్డీ రేటును మార్చకుండా, ఒక స్పష్టమైన ఎక్స్‌టర్నల్ రేటుతో దాన్ని లింక్ చేయాల్సి ఉంటుంది. దీంతో రుణగ్రహీతకు తన లోన్ వడ్డీ రేటు ఎందుకు పెరిగింది లేదా ఎందుకు తగ్గింది అనేది కొంతవరకు స్పష్టంగా తెలుస్తుంది.

**మూడు నెలలకు ఒకసారి రీసెట్**

మరో ముఖ్యమైన మార్పు వడ్డీ రేటు రీసెట్‌కు సంబంధించినది. ప్రతిపాదిత నిబంధనల ప్రకారం.. వడ్డీ రేటు మార్పును కనీసం మూడు నెలలకు ఒకసారి చేయాల్సి ఉంటుంది. ఉదాహరణకు ఆర్బీఐ రెపో రేటును తగ్గిస్తే, దాని ప్రభావం రుణగ్రహీతకు ఎక్కువ కాలం ఆలస్యం కాకుండా అందే అవకాశం ఉంటుంది. అంటే వడ్డీ రేటు తగ్గితే బ్యాంకులు ఈఎంఐని తగ్గించవచ్చు లేదా లోన్ కాలపరిమితిని తగ్గించవచ్చు. అయితే.. ఇదే విధానం రేట్లు పెరిగినప్పుడు కూడా వర్తిస్తుంది. ఆర్బీఐ రెపో రేటును పెంచితే.. దాని ప్రభావం రుణ వడ్డీపై కూడా వేగంగా పడే అవకాశం ఉంది. అప్పుడు ఈఎంఐ పెరగవచ్చు లేదా రుణ కాలపరిమితి ఎక్కువ కావచ్చు.

**లోన్ తీసుకునే సమయంలోనే పూర్తి వివరాలు**

కొత్త నిబంధనల్లో పారదర్శకతకు కూడా ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. లోన్ తీసుకునే సమయంలోనే బ్యాంకులు తమ లోన్ అగ్రిమెంట్‌లో కొన్ని ముఖ్యమైన వివరాలను స్పష్టంగా ఇవ్వాలి. అందులో.. "ఏ బాహ్య బెంచ్‌మార్క్‌కు లోన్‌ను అనుసంధానించారు?, బ్యాంకు మార్జిన్ లేదా స్ప్రెడ్ ఎంత?, వడ్డీ రేటును ఎప్పుడు రీసెట్ చేస్తారు?, వడ్డీ రేటు ఎలా మారుతుంది?" వంటి విషయాలు స్పష్టంగా ఉండాలి. దీంతో రుణగ్రహీతకు తాను తీసుకుంటున్న లోన్ గురించి ముందుగానే మెరుగైన అవగాహన వచ్చే అవకాశం ఉంటుంది.

**ఇప్పటికే లోన్ తీసుకున్నవారికి ఏంటి?**

ఇప్పటికే పాత బెంచ్‌మార్క్ విధానంలో.. లోన్ తీసుకున్నవారికి కూడా కొత్త ప్రతిపాదనలో ఒక అవకాశం కల్పించారు. ప్రతిపాదన ప్రకారం.. 2029 ఏప్రిల్ 1 నాటికి అర్హత ఉన్న పాత రుణాలను ఎలాంటి అదనపు ఛార్జీలు లేకుండా కొత్త ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ విధానంలోకి మార్చుకునే అవకాశం ఉంటుంది. అంటే.. ఇప్పటికే హోమ్ లోన్ లేదా ఇతర ఫ్లోటింగ్ రేట్ లోన్ ఉన్నవారు కూడా భవిష్యత్తులో ఈ కొత్త విధానం ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

**ఎవరికి ఈ నిబంధనలు వర్తిస్తాయి?**

ఈ ప్రతిపాదిత మార్గదర్శకాలు కేవలం పెద్ద వాణిజ్య బ్యాంకులకే పరిమితం కావు. ఇవి అమల్లోకి వస్తే.. "వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార బ్యాంకులు, చీదీఖీజలు, హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీలు" వంటి సంస్థలకు వర్తించే అవకాశం ఉంది.

**రుణగ్రహీతలకు లాభం ఏంటి?**

ఈ మార్పుల ప్రధాన ఉద్దేశం ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించినప్పుడు దాని ప్రయోజనం రుణగ్రహీతలకు వేగంగా అందేలా చేయడం. ఉదాహరణకు ఆర్బీఐ రెపో రేటును తగ్గిస్తే.. బ్యాంకులు కూడా తమ ఫ్లోటింగ్ రేట్ లోన్లపై వడ్డీని తగ్గించాల్సి రావచ్చు. దాంతో కొంతకాలం తర్వాత ఈఎంఐ తగ్గడం లేదా లోన్ కాలపరిమితి తగ్గడం ద్వారా ప్రయోజనం పొందవచ్చు. అదే సమయంలో.. మరో విషయాన్ని కూడా గుర్తుంచుకోవాలి. వడ్డీ రేట్లు ఎప్పుడూ తగ్గుతూనే ఉండవు. ఆర్బీఐ రేట్లు పెంచినప్పుడు ఈ మార్పులు రుణగ్రహీతలకు ప్రతికూలంగా కూడా మారవచ్చు. వడ్డీ పెరిగితే ఈఎంఐ పెరగడం లేదా లోన్ చెల్లించే కాలం పొడిగించడం వంటి పరిస్థితులు రావచ్చు.



## ఏడాదిలో రెండోసారి..
## మరోమారు పెరిగిన ధరలు!

ఇతర వాహన తయారీ సంస్థల మాదిరిగానే.. హ్యుందాయ్ కంపెనీ కూడా తన మొత్తం మోడల్ లైనప్‌లో ధరల అప్డేట్ ప్రకటించింది. 2026 మే 1 నుంచి కొత్త ధరలు (1 శాతం పెరుగుదలతో) అమల్లోకి రానున్నాయి. ఈ విషయాన్ని కంపెనీ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఫైలింగ్‌లో ధృవీకరించింది. హ్యుందాయ్ ప్రకారం.. పెరుగుతున్న ముడిసరుకుల ఖర్చుల కారణంగా ధరలను పెంచడం జరిగిందని తెలుస్తోంది. అయితే వినియోగదారులను అధిక ప్రభావం పడకుండా.. ఖర్చులలోని హెచ్చుతగ్గులను తామే భరించడానికి ప్రయత్నించినప్పటికీ, ఖర్చులు నిరంతరం పెరుగుతుండటంతో, ఆ భారాన్ని కొంతమేరకు స్వల్ప ధర పెంపు ద్వారా వినియోగదారులపై మోపవలసి వచ్చిందని కంపెనీ తెలిపింది.ఏ మోడల్ ధర ఎంత పెరుగుతుంది అనే విషయం కంపెనీ వెల్లడించలేదు. కొత్త ధరలు త్వరలోనే వెల్లడవుతాయి. కాగా హ్యుందాయ్ కంపెనీ వాహనాల ధరలను పెంచడం 2026లో రెండవసారి. గత జనవరిలో.. తన అన్ని మోడళ్లపై 0.6 శాతం వరకు ధరలను పెంచింది. ఇటీవలే.. మార్చిలో ప్రారంభ ధర ముగిసిన తర్వాత, కంపెనీ హ్యుందాయ్ వెన్యూ ధరను రూ. 20,000 మేర సవరించింది.

## కొత్త లుక్‌లో టైగన్ ఫేస్‌లిఫ్ట్: డిజైన్, ఫీచర్స్ ఇలా..




ఫోక్స్‌వ్యాగన్ కంపెనీ భారత మార్కెట్లో ఎట్టకేలకు టైగన్ ఫేస్‌లిఫ్ట్ ఆవిష్కరించింది. ఇది అప్డేటెడ్ డిజైన్, ఫీచర్స్ పొందుతుంది. ఈ లేటేస్ట్ కారుకు సంబంధించిన మరిన్ని వివరాలు ఈ కథనంలో వివరంగా తెలుసుకుందాం. 2021లో దేశీయ విఫణిలో లాంచ్ అయిన టైగన్.. దాదాపు ఐదేళ్లకు ఫేస్‌లిఫ్ట్ రూపంలో అడుగుపెట్టింది. ఈ ఎస్‌యూవీలోని కొత్త హెడ్‌లైట్స్.. ఎల్ఈడీ డేటైమ్ రన్నింగ్ లైట్లతో అనుసంధానం అయింది. గ్రిల్ డిజైన్ కూడా అప్‌డేట్ అయింది. వెనుక భాగంలో టెయిల్‌లైట్లు, నలుపు రంగులో ఉన్న టైగన్ లోగో పొందుతుంది. అల్లాయ్ వీల్స్‌కు కూడా ఒక కొత్త డిజైన్ ఉంది.కొత్త టైగన్ అవకాడో పెర్ల్, స్టీల్ గ్రే రంగులలో లభిస్తుంది. దీంతో మొత్తం 9 రంగుల ఎంపికలు అందుబాటులోకి వచ్చింది. ఇది 10.09-అంగుళాల ఇన్ఫోటైన్‌మెం ట్ సిస్టమ్ పొందుతుంది. ఇది 15 విభిన్న అప్లికేషన్‌లను ఉపయోగించడానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. అంతే కాకుండా.. ఇందులో కొత్త 9 ఇంచెస్ డిజిటల్ డ్రైవర్ క్లస్టర్ కూడా ఉంది, ఇది మీకు టర్న్ బై టర్న్ నావిగేషన్‌ను కూడా అందిస్తుంది.వోక్స్‌వ్యాగన్ టైగన్ ఫేస్‌లిఫ్ట్ 'హలో వోక్స్‌వ్యాగన్' వాయిస్ అసిస్ట్‌ను కూడా పొందుతుంది, ఇది ఏసీ కంట్రోల్స్, మ్యూజిక్ మరియు మరిన్ని ప్రాథమిక ఫంక్షన్‌లను నియంత్రించడంలో మీకు సహాయపడుతుంది. 6 ఎయిర్‌బ్యాగ్‌లు, మల్టీ-కొలిజన్ బ్రేక్‌లు వంటి సేఫ్టీ ఫీచర్స్ కూడా ఉన్నాయి. కాగా ఈ ఎస్‌యూవీ ధరలు తెలియాల్సి ఉంది.పనితీరు పరంగా చూస్తే.. కొత్త వోక్స్‌వ్యాగన్ టైగన్ 114 హార్స్ పవర్, 178 న్యూటన్ మీటర్ టార్క్ ఉత్పత్తి చేసే 1.0-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్‌ను కలిగి ఉంది. 6-స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ లభిస్తుంది. మునుపటి 6-స్పీడ్ ఆటోమేటిక్ ఆప్షన్ స్థానంలో కొత్త 8-స్పీడ్ ఆటోమేటిక్‌ను చేర్చారు. 147 హార్స్ పవర్, 250 ఎన్ఎమ్ టార్క్ అందించే 1.5-లీటర్ టర్బో-పెట్రోల్ ఇంజిన్ కూడా ఈ తాజా మోడల్‌లో అందుబాటులో ఉంది.




## 20 రోజులకే ఓటీటీలోకి వచ్చిన తెలుగు సినిమా!

సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ బాబు సోదరుడు రమేశ్ బాబు కుమారుడు జై కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అయిన చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. 'మంగళవారం' ఫేం అజయ్ భూపతి దర్శకత్వం వహించిన ఈ చిత్రంతో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కూతురు రాషా తడాని హీరోయిన్‌గా తెలుగు తెరకు ఎంట్రీ ఇచ్చింది. జులై 30న థియేటర్స్‌లో విడుదలైన ఈ చిత్రానికి తొలి రోజే నెగెటివ్ టాక్ వచ్చింది. దీంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం ఆశించిన స్థాయిలో ఆడలేకపోయింది. తాజాగా ఈ చిత్రం ఓటీటీలో రిలీజ్ అయ్యేందుకు రెడీ అయింది. ఆగస్ట్ 20 నుంచి ప్రముఖ ఓటీటీ అమెజాన్ ప్రైమ్ వీడియోలో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ వైజయంతి మూవీస్ సంస్థ ఎక్స్ వేదికగా వెల్లడించింది.

**'శ్రీనివాస మంగాపురం'కథేంటంటే..**

పెద్దిరెడ్డి('కిక్'శ్యామ్).. తిరుపతిలో మంచి పలుకుబడి, డబ్బు ఉన్న వ్యక్తి. ఆయన ఫ్యామిలీ వైపు కన్నెత్తి చూడడానికి కూడా జనాలు భయపడిపోతారు. అలాంటి వ్యక్తి కూతురు మంగ(రాషా తడాని)ని తొలి చూపులోనే ప్రేమిస్తాడు శ్రీనివాస్(జై కృష్ణ). అతనికి తిరుపతి కొత్త. జులాయిగా తిరిగే స్వతంత్ర బాబు(నరేశ్)తో స్నేహం ఏర్పరచుకొని మంగ చుట్టూ తిరుగుతుంటాడు. మంగ మాత్రం అతన్ని పట్టించుకోదు. కొన్నాళ్ల తర్వాత ఇద్దరి మధ్య స్నేహం ఏర్పడుతుంది. ఇంతలోనే వేరే వ్యక్తితో మంగకు ఎంగేజ్‌మెంట్ కూడా జరుగుతుంది. అయినా కూడా తన ప్రేమ విషయాన్ని మంగతో పంచుకుంటాడు శ్రీనివాస్. ఆమె రిజెక్ట్ చేసినా..వదిలిపెట్టడు. ఎందుకలా? అసలు శ్రీనివాస్ ఎవరు? తిరుపతి ఎందుకు వచ్చాడు? నిజంగానే మంగతో తొలి చూపులోనే ప్రేమలో పడ్డాడా? వాసుబాబు ఎవరు? బళ్లారి డాన్ వెంకటప్పయ్యనాయుడు(మోహన్ బాబు)తో శ్రీనివాస్‌కి ఉన్న




## అనుకున్న సమయానికే..

**ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'స్పిరిట్' వాయిదా పడే అవకాశాలు ఉన్నాయని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. తాజాగా ఈ వార్తలపై మేకర్స్ స్పష్టతనిచ్చారు. ముందస్తుగా ప్రకటించిన విధంగానే వచ్చే ఏడాది మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా చిత్రాన్ని విడుదల చేస్తామని తెలిపారు. "స్పిరిట్' రిలీజ్ విషయంలో ఎలాంటి మార్పు ఉండదు. షూటింగ్ కూడా ప్రణాళిక ప్రకారం జరుగుతున్నది. భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేస్తాం' అని మేకర్స్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో ప్రభాస్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు.ఆయన తొలిసారి పోలీస్ క్యారెక్టర్‌లో నటిస్తుండటంతో అభిమానుల్లో ఆసక్తినెలకొంది. ఆయన మేకోవర్ అందరిని సర్‌ప్రైజ్ చేస్తుందని చెబుతున్నారు. త్రిప్తి దిమ్రీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని టీ సీరిస్, భద్రకాళి ఫిల్మ్స్ భారీ వ్యయంతో తెరకెక్కిస్తున్నాయి.**

## రజినీకాంత్ 'జైలర్ 2' ఫస్ట్ సింగిల్ అప్‌డేట్.. 'అలా బోలెలో' ప్రోమో రిలీజ్!

సూపర్ స్టార్ రజినీకాంత్ హీరోగా, నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ చిత్రం 'జైలర్ 2' (ఝఱశ్రీవతీ 2). బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించిన 'జైలర్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన మ్యూజికల్ ప్రమోషన్స్‌ను మేకర్స్ అధికారికంగా ప్రారంభించారు. ఈ సినిమాలోని మొదటి పాట 'అలా బోలెలో' (ూశ్రీఖ దీశీశ్రీవశ్రీశీ) ను ఆగస్టు 21న గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు సన్ పిక్చర్స్ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు తాజాగా పాటకు సంబంధించిన ప్రోమో వీడియోను విడుదల చేసింది. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా, ఈ పాటపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'టైగర్' ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజినీకాంత్ మరోసారి పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో అలరించనున్నారు. భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని అక్టోబర్ 15న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఇప్పటికే స్పష్టం చేశారు.






## బావ బామ్మర్ది సౌజన్యంతోజనవరి 12 విడుదల

సినిమా టైటిల్స్ విషయంలో కాస్త భిన్నంగా ఆలోచిస్తుంటారు అగ్ర దర్శకుడు అనిల్ రావిపూడి. 'సంక్రాంతికి వస్తున్నాం' 'మన శంకరవరప్రసాద్ గారు' వంటి టైటిల్స్ కొత్తదనంతో ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం వెంకటేష్, కల్యాణ్‌రామ్‌తో అనిల్ రావిపూడి భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని రూపొందిస్తున్న విషయం తెలిసిందే. సాహు గారపాటి నిర్మాత. ఈ చిత్రానికి 'జనవరి 12 విడుదల' అనే ఇంట్రెస్టింగ్ టైటిల్‌ను ఖరారు చేశారు. వచ్చే ఏడాది జనవరి 12న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను రిలీజ్ చేశారు. దివంగత దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు నివాళిగా ఆయన దర్శకత్వం వహించిన 'అప్పుల అప్పారావు' చిత్రంలోని పాపులర్ కామెడీ సీక్వెన్స్‌తో ఈ వీడియో మొదలైంది. ఇందులో చిత్ర నాయకానాయికలు వెంకటేష్, కల్యాణ్‌రామ్, కీర్తిసురేష్, కృతిశెట్టి, దర్శకుడు అనిల్ రావిపూడి మధ్య జరిగిన సరదా సంభాషణ నవ్వుల్ని పంచింది. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే ట్యాగ్‌లైన్ సినిమాలో వెంకటేష్, కల్యాణ్‌రామ్ పాత్రల మధ్య ఉన్న రిలేషన్‌ను తెలియజేసేలా ఉంది.

## తెలుగులో తొలి ఎఐ చిత్రం... అంబ ద రివెంజ్

తెలుగు సినీ పరిశ్రమలో సరికొత్త అధ్యాయానికి నాంది పలికే విధంగా.. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న తొలి ఫీచర్ ఫిల్మ్ 'అంబ' ద రివెంజ్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సాంకేతిక విప్లవాన్ని తెరపైకి తీసుకువస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. హనుమాన్ విజయోత్సవం సందర్భంగా ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నిర్మాత శ్రీకాంత్ రెడ్డి కుందూరు నిర్మిస్తుండగా.. రాణి మాడిసన్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. ఇక జయవర్ధన్ మాడి క్రియేటివ్ డైరెక్టర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. శ్రీ లలితకళా ఫిలిమ్స్, నక్క తోక ఫిల్మ్స్ నిర్మాణ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. పౌరాణిక ఇతిహాసమైన మహాభారతంలోని శక్తివంతమైన పాత్ర అంబ కథను ఆధారంగా తీసుకుని ఈ చిత్రాన్ని వినూత్నంగా తెరకెక్కిస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో పాటు ఏఐ టూల్స్ వినియోగంతో విజువల్స్, పాత్రల రూపకల్పన, కథన నిర్మాణం వంటి అంశాలను కొత్త శైలిలో ఆవిష్కరించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది.




## రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్

విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.

Printed, Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com